ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు



మానవాళికి
TGTEL/25/A1132

# జనంవార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..



Q6 NEWS తెలుగు



మేడ్చల్ | గురువారం | 10.09.2026 | సంపుటి : 2 | సంచిక : 69 | పేజీలు : 8 | వెల : 5/- | ఎడిటర్ : గడ్డమీది నాగరాజు పటేల్




తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌కు

## ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి

**ప్రత్యేక ఆహ్వానం పలికిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**సానుకూలంగా స్పందించిన ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్**

**తెలంగాణ బియ్యం ఎగుమతుల విస్తరణకు సానుకూల స్పందన**

**అంతర్జాతీయ విపణిలో తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులకు విస్తృత అవకాశాలు**

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 09 : తెలంగాణను ప్రపంచ పెట్టుబడులు, వ్యవసాయ వాణిజ్యం, పారిశ్రామిక అవకాశాలకు ప్రధాన గమ్యస్థానంగా నిలిపే లక్ష్యంతో 2026 డిసెంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న ప్రతిష్ఠాత్మక లి"తెలంగాణ రైజింగ్ సమ్మిట్"లికు హాజరుకావాల్సిందిగా ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ క

మిగతా 2 లో

# కుట్రదారులను ఎవరినీ వదలం

**ఫాంహౌస్ కుట్ర నుంచి... శుద్ధీకరణ ఘటన వరకు సమగ్ర విచారణ**

**కేసీఆర్.. తన సభ్యులను ఉన్మాద చర్యలకు ఉసిగొల్పారు**

**విచారణ జరిపి జైలుకు పంపుతాం**

**వారి చేష్టలు, దాడులు, మాటలు.. తీవ్రవాదులు, ఉగ్రవాదుల చర్యల కన్నా హేయం : సీఎం రేవంత్‌రెడ్డి**

అసెంబ్లీ స్పీకర్‌ను దూషించిన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. స్పీకర్‌పై మాటల దాడికి పాల్పడటం పార్లమెంట్, ముంబయి, పుల్వామా దాడులతో సమానమని వ్యాఖ్యానించారు. ప్రజాసమస్యలపై చర్చ జరగకుండా అడ్డుకునేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్రకు తెరతీశారని ఆరోపించారు. శాసనసభలో బుధవారం మాట్లాడిన సీఎం.. స్పీకర్ స్థానాన్ని, ఆయన తల్లిని అవమానించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. స్పీకర్‌ను దూషించిన ఘటనను సభ్యులంతా ముక్తకంఠంతో ఖండించారని తెలిపారు.



హైదారాబాద్, సెప్టెంబర్ 09 :శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను, ఆయన మాతృమూర్తిని కించపరిచి అవమానించటం, అనంతరం ఆయనకు మద్దతుగా నిరసన తెలిపిన దళితులు నడిచిన ప్రాంతాన్ని శుద్ధి చేయటాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ రెండు ఘటనలను కుట్రలుగానే పరిగణిస్తున్నామని చెప్పారు. ఇందుకు వ్యూహకర్తలు, ప్రత్యక్షంగా అమలు చేసిన వారిపై ఆయా సెక్షన్ల కింద క్రిమినల్ కేసులు నమోదు చేసి, విచారణ జరిపి జైలుకు పంపే ఏర్పాటు చేస్తామని అన్నారు. ముంబయిపై దాడి చేసిన కసబ్ లాంటి ఉగ్రవాదులకు కొన్ని అంశాలను నూరిపోసి ఉన్మాదులుగా

-మిగతా 2 లో..



# బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్

**కేటీఆర్, హరీశ్‌రావుతో సహ 22 మందిపై వేటు**

**సభ్యుల సస్పెన్షన్‌కు మంత్రి శ్రీధర్‌బాబు సిఫారసు**

**సస్పెన్షన్ వేటుకు స్పీకర్ ప్రసాద్ కుమార్ ఆమోదం**

**సెషన్ మొత్తం సస్పెండ్ చేసిన శాసనసభ స్పీకర్**

హైదారాబాద్, సెప్టెంబర్ 09 : బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై శాసనసభలో సస్పెన్షన్ వేటు పడింది. దీంతో ఈ సమావేశాలకు మొత్తంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దూరంగా ఉండనున్నారు. శాసనసభ సజావుగా కొనసాగకుండా అడ్డుకుంటున్న బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్‌కు శ్రీధర్‌బాబు సిఫారసు చేయగా, స్పీకర్ అనుమతిస్తూ వేటు వేశారు. శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, అనిల్ జాదవ్, కౌశిక్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, కోవా లక్ష్మి, మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, విజేయుడు, కె.సంజయ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, కేపీ వివేకానందలపై సస్పెన్షన్ వేటు పడింది. మూడో రోజు సభ ప్రారంభమైన వెంటనే 'వి వాంట్ జస్టిస్' అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శాసన సభా కార్యకలాపాలకు

-మిగతా 2 లో..

# 10వేల కోట్లతో రైల్వే కారిడార్లు

**దేశవ్యాప్తంగా రైల్వే మల్టీ ట్రాకింగ్**

**ఘట్‌కేసర్-కాజీపేట మధ్య నాలుగో లైన్**

**నాలుగు పరిధిలో 5 మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు**

**దక్షిణాదిలో 5, ఉత్తరాదిలో 3 ప్రాజెక్టులు**

**తెలుగు రాష్ట్రాలకు భారీ ప్రయోజనం**

**మీడియాకు వెల్లడించిన అశ్విని వైష్ణవ్**

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 09 : రైల్వే వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలుగు రాష్ట్రాల్లోని రద్దీ మార్గాలతో సహా దేశవ్యాప్తంగా పలు మల్టీ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర మంత్రిమండలి ఆమోద ముద్ర వేసింది. ఈ వివరాలను కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం మీడియాకు వెల్లడించారు. కేబినెట్ నిర్ణయం ప్రకారం, తెలంగాణలోని

-మిగతా 2 లో..





# విమర్శలను న్యాయవ్యవస్థ వ్యతిరేకించదు

**సమాచారం లేని వాదనలను వ్యతిరేకిస్తుంది**

**ఎన్‌సీఈఆర్‌టీపై సుప్రీం కీలక వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 09 : విమర్శలను న్యాయవ్యవస్థ వ్యతిరేకించదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కానీ సమాచారం లేని వాదనలను వ్యతిరేకిస్తుందని స్పష్టం చేసింది. అయితే న్యాయవ్యవస్థపై విమర్శలను సరైన వేదిక ద్వారా నిష్పక్షపాతంగా, హేతుబద్ధమైన పద్ధతిలో వ్యక్తం చేయాలని హెచ్చరించింది. విమర్శకు, మౌనానికి మధ్య తేడా లేదని పేర్కొంది. బాధ్యతాయుతమైన చర్చకు, సమాచారం లేని వాదనకు మధ్యే తేడా ఉందని అభిప్రాయపడింది. ఎన్‌సీఈఆర్‌టీ ఎనిమిదో తరగతి పాఠ్యపుస్తకంలో 'న్యాయవ్యవస్థలోని అవినీతి'

-మిగతా 2 లో..



# మా హక్కులు పరిరక్షించండి

**మాపై కేసులు, అరెస్టులు సస్పెన్షన్ల విషయంలో జోక్యం చేసుకోండి**

**గవర్నర్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల 13 పేజీల వినతిపత్రం**

**అన్ని ఆధారాలూ ఇచ్చాం: కేటీఆర్**

హైదారాబాద్, సెప్టెంబర్ 09 : రాష్ట్రంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై దాడులు, కేసులు, వారి అరెస్టులు సస్పెన్షన్లపై జోక్యం చేసుకోవాలని గవర్నర్ శివప్రతాప్ శుక్లాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కోరారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మాజీ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల బృందం బుధవారం లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి ఈ మేరకు 13 పేజీల వినతిపత్రాన్ని సమర్పించింది. 'రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వం విఫలమైంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులపై భౌతిక దాడులు జరిగాయి. పోలీసులు

-మిగతా 2 లో..



**నేటి చికెన్ ధరలు**

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 92 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 119 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 184 (కిలో) |
| స్కిన్ లెస్ | 208 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹78

# కడుపు మండి మాట్లాడా!

**ఒకరి చావును కోరడం సమర్థనీయం కాదు**

**కేసీఆర్ పై వ్యాఖ్యల పట్ల ఎమ్మెల్యే శంకర్ వివరణ**

హైదారాబాద్, సెప్టెంబర్ 09 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలపై చెలరేగిన రాజకీయ దుమారంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పందిస్తూ మీడియా వేదికగా వివరణ ఇచ్చారు. వ్యక్తిగతంగా ఏ ఒక్కరి చావును కోరుకోవడం ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదని ఆయన అంగీకరించారు. అయితే, సభలోనూ బయటా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, దళిత వర్గానికి చెందిన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను, మహిళా మంత్రులను బీఆర్ఎస్

-మిగతా 2 లో..



ఆయుష్ విద్యార్థులకు

# సర్కార్ గుడ్‌న్యూస్

**స్టైఫండ్స్ భారీగా పెంచుతూ జీవో జారీ**

**సెక్రటేరియట్‌లో మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన స్టూడెంట్స్**

**జీవో కాపి అందజేసిన మంత్రి దామోదర్ రాజనర్సింహ**

ఆయుర్వేదం, హోమియోపతి, యునాని, నేచురోపతి విభాగాల్లోని హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థుల స్టైఫండ్లను భారీగా పెంచుతూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఇప్పటివరకు హౌస్ సర్జన్లకు నెలకు రూ.13,754గా ఉన్న స్టైఫండ్‌ను రూ.29,792కు పెంచారు. పీజీ విద్యార్థుల స్టైఫండ్ 34,385 నుంచి 74,482కు పెరిగింది. స్టైఫండ్ పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూ ఆయుష్ విద్యార్థులు, డాక్టర్లు బుధవారం మధ్యాహ్నం, సచివాలయంలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.




# బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరు

**ఇక ఫుల్ ఫోకస్ తెలంగాణపైనే..**

**తెలంగాణలో అధికారంలోకి వస్తాం**

**కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్**



హైదారాబాద్, సెప్టెంబర్ 09 : తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, ఈ విజయాన్ని ఏ శక్తీ ఆపలేదని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు

-మిగతా 2 లో..

## మా హక్కులు పరిరక్షించండి

(మొదటిపేజీ తరువాయి)

అధికార పార్టీ నేతలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ సభ్యులపై పోలీసులు, మార్షల్స్ దాడి చేశారు. కేసీఆర్ ఇంటిపై దాడికి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు నేతృత్వం వహించారు. పోలీసులు వారికి ఎస్కార్ట్ ఇవ్వడంతో పాటు రోప్ పార్టీలు ఏర్పాటు చేసి వేలాది మందిని అక్కడికి అనుమతించారు.రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 19, 21, 167, 355 తదితర నిబంధనల మేరకు మా హక్కులు కాపాడండి. మాజీ సీఎం కేసీఆర్ నివాసానికి భద్రత కల్పించాలి..'అని ఆ వినతిపత్రంలో బీఆర్ఎస్ విజ్ఞప్తి చేసింది. గవర్నర్‌తో భేటీ అనంతరం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు లోక్‌భవన్ బయట మీడియాతో మాట్లాడారు. తమ పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు గవర్నర్‌ను కలిసినట్లు కేటీఆర్ వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడిచినా ప్రజలకు ఇ చ్చిన హామీల అమల్లో వైఫల్యంతో పాటు పాలనా వైఫల్యాన్ని గవర్నర్‌కు వివరించినట్లు తెలిపారు. రైతులు, నిరుద్యోగులు, యువత, పాలిటెక్నిక్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. అసెంబ్లీ వద్ద తమపై జరిగిన దాడులు, ముఖ్యంగా మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడికి సంబంధించిన ఫొటోలు, ఆధారాలను అందజేశామని చెప్పారు. సునీతా లక్ష్మారెడ్డి చీర లాగిన ఘటనను కూడా వివరించామన్నారు. ఎర్రవల్లిలో మాజీ సీఎం కేసీఆర్ నివాసంపై దాడి యత్నం, తమపై దాడి చేసిన పోలీసులపై ఫిర్యాదు చేసినా పట్టించుకోని తీరును వివరించినట్లు కేటీఆర్ తెలిపారు. అసెంబ్లీ, శాసనమండలిలోకి రానివ్వకుండా తమను ప్రభుత్వం అడ్డుకుందని, హైకోర్టు ఆదేశాలను కూడా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని గవర్నర్‌కు వివరించినట్లు కేటీఆర్ తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ముగిసేంత వరకు సస్పెండ్ చేసిన విషయాన్ని కూడా ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు. శాసనమండలి సభ్యుల సస్పెన్షన్ అంశాన్ని వివరించామని, ప్రభుత్వం విడుదల చేసిన ఏఐ ఫొటోలు, వీడియోలపైనా ఫిర్యాదు చేశామని చెప్పారు. తప్పుడు చిత్రాలు, ఫిర్యాదులు ఉపయోగించిన వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కేటీఆర్ తెలిపారు. రాష్ట్రంలో న్యాయం జరగకుంటే జాతీయ మహిళా కమిషన్‌ను ఆశ్రయిస్తామని చెప్పారు. కాగా శాసనసభ వ్యవహారాలతో పాటు బయట జరిగిన అన్ని ఘటనలపై విచారణ జరిపిస్తామని, సీఎస్, డీజీపీని పిలిపించి వివరాలు తెలుసుకుంటానని గవర్నర్ తమకు హామీ ఇ చ్చినట్లు తెలిపారు.

# కుట్రదారులను వదలం

(మొదటిపేజీ తరువాయి)

మార్చి మన దేశంపైకి పంపిన తరహాలోనే, కేసీఆర్ కూడా తన అనుచరులకు ఇలాగే నూరిపోసి ఉన్మాదులుగా మార్చి ఉసిగొల్పారని ఆరోపించారు. దాంతో పేట్రేగిన నేతలు ఆ రోజు దళిత స్పీకర్‌ను కించపరచటమే లక్ష్యంగా వ్యవహరించారని మండిపడ్డారు. ఆ కార్యక్రమానికి ముందురోజు ఫామ్‌హౌస్‌లో జరిగిన భేటీలో చేసిన కుట్ర మొదలు ఆ తర్వాత వరుసగా చోటుచేసుకున్న ఘటనలపై సంపూర్ణ విచారణ చేపడతామన్నారు. హైదరాబాద్ సిటీ పోలీసు జాయింట్ కమిషనర్ విజయకుమార్‌ను విచారణాధికారిగా నియమిస్తున్నట్టు వెల్లడించారు. బుధవారం శాసనసభలో సీఎం ఈ మేరకు ప్రకటన చేశారు. కేసీఆర్ నివాసం వద్ద నిరసన తెలిపేందుకు వెళ్లిన దళితులను అవమానించేలా ఆ ప్రాంతాన్ని శుద్ధి చేసినట్టుగా చెబుతున్న వ్యవహారంపై బుధవారం శాసనసభలో చర్చ జరిగింది. ఈ చర్చను ముగిస్తూ ముఖ్యమంత్రి కీలక ప్రకటన చేశారు. 'చట్టాలు, సెక్షన్లను అడ్డుపెట్టుకుని కొంతమంది కోర్టుల నుంచి బెయిల్ పొందవచ్చు. కానీ తెలంగాణ సమాజం మాత్రం వారికి బెయిల్ ఇవ్వదు. జరిగిన తప్పును అంగీకరించి క్షమాపణ చెబితే కిరీటం ఊడిపోతుందా? స్థాయి తగ్గుతుందా? సభాపతిని అవమానించిన విషయంలో ప్రభుత్వం బాధ్యతతో వ్యవహరిస్తుంది. చట్టపరంగా శిక్షించే వరకు వెనక్కి తగ్గబోదు. సభాపతి పదవిలో ఉన్న గడ్డం ప్రసాద్‌కుమార్ మనసుకు గాయం చేసేలా ఉన్మాదంతో వ్యవహరించిన వారిని వదిలే ప్రసక్తే లేదు. వ్యక్తినే కాకుండా తల్లిని కూడా అవమానించే స్థాయికి వెళ్లారు. మహిళలను శక్తిగా కొలిచే సమాజంలో ఇలాంటి చర్యలకు చోటుంటుందా? సభలో అధికారులపై దాడులు చేయడంతోపాటు స్పీకర్ కుర్చీని అవమానించేలా వ్యవహరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధం. స్పీకర్‌ను అవమానించిన ఘటనకు నిరసనగా కొంతమంది ప్రజాస్వామ్యవాదు లు ఫామ్‌హౌస్ వద్ద డప్పు దరువులతో ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలిపారే తప్ప ఎలాంటి ఉన్మాదానికీ పాల్పడలేదు. దళిత సోదరులు తమ మనసులోని భావాలను వ్యక్తం చేసేందుకు డప్పును ఒక సాధనంగా



ఉపయోగిస్తారు. నిరసన తెలిపిన దళిత ప్రతినిధులను పిలిచి మాట్లాడి సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత కేసీఆర్‌పై ఉంది. కానీ అందుకు భిన్నంగా వ్యవహరించి, దళితులు తిరిగిన నేలను శుద్ధి చేయాలని ఆదేశించడం ద్వారా దళితనులను తీవ్రంగా అవమానించారు. దళితులు నడిచిన నేలను శుద్ధి చేస్తే.. మరి దొరతనం, ఆహంకారంతో ఉన్న ఆ నేతల మనసుల్లో పేరుకుపోయిన అంటరానితన భావజాలాన్ని ఎలా శుద్ధి చేస్తారు? యాసిడ్‌తో కడగాలా? దళితుడు దుక్కి దున్ని పంట పండిస్తేనే అందరి కడుపులు నిండుతున్నాయి. మనకు అన్నం పెడుతున్న వారిని ఇంతగా అవమానిస్తారా? దళితులను అవమానపరుస్తూ వారిని కించపరిచిన ఆ కుటుంబాన్ని సామాజికంగా బహిష్కరించాలి. అప్పుడే వారికి దళితులు ఎదుర్కొంటున్న వివక్ష ఎలాంటిదో తెలిసొస్తుంది. సమాజంలో అశాంతిని ప్రోత్సహించి రెండు వర్గాల మధ్య వైరాన్ని పెంచాలని ప్రయత్నిస్తున్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నవారు ధనబలంతో వ్యవస్థలను లొంగదీసుకోవాలని చూస్తున్నారు. మేము మాత్రం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు కట్టుబడి ఉన్నాం. కాంగ్రెస్ పార్టీ దేశంలోని కోట్లాది ప్రజలకు నమ్మకం, భరోసా కల్పించింది. కర్ణాటకలోని ఓ చిన్న గ్రామంలో పుట్టి, రజాకార్ల దాడుల్లో తల్లిని కోల్పోయి, కార్మిక నాయకుడిగా ఎదిగి జాతీయ స్థాయికి చేరుకున్న నేత మల్లికార్జున ఖర్గేను అవమానించడం బాధాకరం. ఉత్తరాఖండ్‌లోని ఓ మైదానంలో ఖర్గే సభలో పాల్గొన్న అనంతరం ఆగస్టు 10న బీజేపీ అనుబంధ సంస్థ అదే మైదానంలో శుద్ధీకరణ కార్యక్రమం నిర్వహించడం హేయమైన చర్య. ఆ ఘటనను ఈ సభ ముక్తకంఠంతో ఖండిస్తోంది. తాజాగా తెలంగాణ వేదికగా బీఆర్ఎస్ దళిత వ్యతిరేక వ్యవహారానికి తెరలేపింది. విద్యా రంగంలోని అక్రమాలు, ధరణి అక్రమాలు, 22ఏ రాద్ధాంతంపై శాసనసభలో చర్చించాలని ప్రభుత్వం భావించింది. ఈ అంశాలపై చర్చ జరిగితే గత పదేళ్లలో జరిగిన దురాగతాలు, రాష్ట్రంపై పేరుకుపోయిన అప్పుల గురించి ప్రజలకు అవగాహన కలుగుతుందనే భయంతోనే చర్చను అడ్డుకునేందుకు ఈ కుట్రలు పన్నారు. సభను అడ్డుకోవడమే కాకుండా స్పీకర్‌ను అవమానించే స్థాయికి వెళ్లడం అత్యంత దురదష్టకరం. కాంగ్రెస్ పార్టీ దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించింది. ఎస్సీ, ఎస్టీలకు విద్య, ఉ ద్యోగం, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించడం ద్వారా సామాజిక న్యాయానికి బాటలు వేసింది. కాంగ్రెస్ విధానం సామాజికంగా వెనుకబడిన వర్గాలకు అవకాశాలు కల్పించడమే..' అని సీఎం స్పష్టం చేశారు. స్పీకర్ మనసును గాయపరిచిన వారిని వదిలే ప్రసక్తి లేదని పునరుద్ఘాటించారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడే విషయంలో ప్రభుత్వం స్పీకర్‌కు పూర్తిగా అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.



## తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌కు ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి

(మొదటిపేజీ తరువాయి)

కార్యదర్శి ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్ జూనియర్‌ను రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆహ్వానించారు. న్యూఢిల్లీలో ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్ తో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ ఉదయం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యత, ఉత్పాదక సామర్థ్యం, ఎగుమతి అవకాశాలను ఆయనకు వివరించడంతోపాటు తెలంగాణ రైజింగ్ సమ్మిట్ లక్ష్యాలు, రాష్ట్రంలో అందుబాటులో ఉన్న పెట్టుబడి అవకాశాలను వివరించారు. ఈ సందర్భంగా తెలంగాణ నుంచి ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతులను భారీగా పెంచడం, ఇరు ప్రాంతాల మధ్య వ్యవసాయ వాణిజ్య సంబంధాలను మరింత విస్తరించడం, దీర్ఘకాలిక వాణిజ్య భాగస్వామ్యాన్ని నెలకొల్పడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణ నుంచి పెద్ద పరిమాణంలో బియ్యాన్ని కొనుగోలు చేసే అవకాశాలను పరిశీలిస్తామని ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి సానుకూలంగా స్పందించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. తెలంగాణలో ఉత్పత్తి అవుతున్న నాణ్యమైన మాంస ఉత్పత్తులు, అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన విత్తనాల కొనుగోలుపైనా శ్రీ ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్ జూనియర్ ఆసక్తి వ్యక్తం చేశారని తెలిపారు. ప్రపంచస్థాయి ప్రమాణాలు, విస్తారమైన ఉత్పత్తి సామర్థ్యం, నాణ్యతతో తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించగలవని ఆయన పేర్కొన్నారు. "తెలంగాణ రైతు పండించిన ధాన్యానికి అంతర్జాతీయ మార్కెట్ ద్వారాలు తెరవడమే మా ప్రభుత్వ లక్ష్యం. బియ్యం ఎగుమతులు విస్తరించడం ద్వారా రైతులకు మెరుగైన ధరలు లభించడంతోపాటు రైస్‌మిల్లర్లు, విత్తన కంపెనీలు, మాంస ఉత్పత్తిదారులు, ఆహారశు ద్ధి పరిశ్రమలకు అపారమైన అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. వ్యవసాయాన్ని కేవలం జీవనాధారంగా కాకుండా ప్రపంచ మార్కెట్‌తో అనుసంధానమైన లాభసాటి ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోంది" అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రైజింగ్ సమ్మిట్ రాష్ట్ర అభివృద్ధి ఆకాంక్షలకు అంతర్జాతీయ వేదికగా నిలుస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. వ్యవసాయం, ఆహారశుద్ధి, విత్తనోత్పత్తి, ఎగుమతులు, సాంకేతిక పరిజ్ఞానం, పెట్టుబడుల రంగాల్లో తెలంగాణ--ఫిలిప్పీన్స్ మధ్య నూతన భాగస్వామ్యానికి ఈ సమ్మిట్ బలమైన పునాది వేస్తుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.

## ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థలో సాంకేతిక సమస్య

### ప్రపంచ వ్యాప్తంగా వెయ్యికిపైగా విమానాలు రద్దు!

### భారత్ విమానయాన సంస్థలపైనా తీవ్ర ప్రభావం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 09 :** బ్రిటన్‌లో మంగళవారం విమాన ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థలో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగా దేశవ్యాప్తంగా విమాన రాకపోకలకు భారీ అంతరాయం ఏర్పడింది. 1,000కుపైగా విమానాలు రద్దు కాగా, మరెన్నో విమానాలు గంటల తరబడి ఆలస్యమయ్యాయి. దీని ప్రభావం భారత్? విమానయాన సంస్థలపై కూడా పడింది. విమాన ట్రాకింగ్ సంస్థ ఫ్లైట్‌రాడార్24 ప్రకారం, ఈ అంతరాయం ప్రభావం బ్రిటన్‌లోని 15 విమానాశ్రయాలకు వ్యాపించింది. విమానాశ్రయాల టెర్మినల్స్‌తో పాటు రన్‌వేలపైనా ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. అయితే బ్రిటన్ నేషనల్ ఎయిర్ ట్రాఫిక్ సర్వీసెస్ (ఎన్?ఏటీఎస్) తన ఫ్లైట్ ప్రాసెసింగ్ వ్యవస్థలో తలెత్తిన సమస్యను సాయంత్రానికి పరిష్కరించినట్లు తెలిపింది. కానీ అప్పటికే భారీ సంఖ్యలో విమానాలు ఆలస్యమవడంతో దాని ప్రభావం చాలా గంటల పాటు కొనసాగింది. విమానాలు, సిబ్బంది తమ షెడ్యూల్ స్థానాల్లో లేకపోవడంతో సేవలను సాధారణ స్థితికి తీసుకురావడం విమానయాన సంస్థలకు సవాలుగా మారింది. లండన్?లోని హీత్రో విమానాశ్రయంలో విమానాల బయలుదేరే సేవలు తిరిగి ప్రారంభమైనప్పటికీ, రాత్రంతా వచ్చే విమానాలను నిలిపివేశారు. ప్రయాణికులు తమ విమానాల పరిస్థితిని సంబంధిత ఎయిర్‌లైన్స్ ద్వారా తెలుసుకోవాలని విమానాశ్రయ అధికారులు సూచించారు. ఈ సాంకేతిక సమస్య కారణంగా బ్రిటిష్ ఎయిర్?వేస్ 100కుపైగా విమానాలను రద్దు లేదా దారి మళ్లించినట్లు తెలిపింది. విమానాలు, సిబ్బంది వివిధ ప్రాంతాల్లో చిక్కుకుపోవడంతో పరిస్థితి చక్కదిద్దేందుకు సమయం పడుతుందని సంస్థ వెల్లడించింది.

## 10వేల కోట్లతో రైల్వే కారిడార్లు

(మొదటిపేజీ తరువాయి)

ఘట్‌కేసర్–కాజీపేట సెక్షన్‌లో నాలుగో లైను నిర్మాణానికి ఆమోదం లభించింది. 110 కిలోమీటర్ల ఈ ప్రాజెక్టుకు రూ. 2,419 కోట్లు అవుతుందని అంచనా ఉంది. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్ మీదుగా సాగే అరక్కోణం–రేణిగుంట మార్గంలో 3వ, 4వ లైన్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ ప్రాజెక్టుల పూర్తితో ఆయా మార్గాల్లో రైళ్ల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. నాలుగు రాష్ట్రాల్లోని 17 జిల్లాల పరిధిలో నాలుగు లైన్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 10,021 కోట్లుగా కేంద్రం పేర్కొంది. దీంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక పరిధిలో ఐదు మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు రాబోతున్నాయి. కొత్త లైన్ల నిర్మాణం ద్వారా రైల్వే నెట్‌వర్క్ సామర్థ్యం పెరగడమే కాకుండా, సరుకు రవాణా, ప్రయాణికుల రైళ్ల వేగం కూడా పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వీటిని 2029-30 నాటికి పూర్తి చేయాలని ప్రణాళిక వేసింది. బుల్లెట్ రైలు ప్రారంభోత్సవం 2027లో జరగనుంది. దీని నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. పనులు డిసెంబర్ నాటికి పూర్తవుతాయి. వచ్చే ఏడాది మే-జూన్ నాటికి టెస్టింగ్? కోసం రైలు పట్టాలపైకి వస్తుంది. టెస్టింగ్? పూర్తయిన తర్వాత ప్రారంభోత్సవం జరుగుతుందని అన్నారు. ఇందులో, అరక్కోణం– రేణిగుంట సెక్షన్‌లో 77 కి.మీ.పొడవుతో 3, 4 లేన్ల నిర్మాణాన్ని మూడేళ్లలో పూర్తి చేయాలని నిర్ణయం తీసుకుంది. అలాగే, ఘట్‌కేసర్– కాజీపేట మధ్య 110 కి.మీ. పొడవుతో నాలుగో లేన్ నిర్మాణానికి రూ.2,419 కోట్లతో ఆమోదం లభించింది. దీంతో పాటు వైట్‌ఫీల్డ్–బంగారుపేట మధ్య 47 కిలోమీటర్ల పొడవుతో 3, 4 లైన్ల నిర్మాణం, 159 కిలోమీటర్ల మేర సేలం–కరూర్–దుండిగల్ డబ్లింగ్, 147 కిలోమీటర్ల మేర హోసూర్–ఒమలూరు డబ్లింగ్‌కు ఆమోదం లభించింది.ఈ ప్రాజెక్టుల నిర్మాణంతో రైళ్ల రాకపోకల సామర్థ్యం పెరిగి, రద్దీ తగ్గనున్నట్లు ప్రభుత్వం అభిప్రాయపడింది. దేశవ్యాప్తంగా ఉన్న అనేక ప్రముఖ పర్యటక ప్రదేశాలకు రైలు మార్గాలు మె-



రుగుపడనున్నట్లు తెలిపింది. తారాతరిణి ఆలయం, జగన్నాథ ఆలయం(ఝార్సుగూడ సమీపంలోని పురాతన ఆలయం), బంధవ్‌గఢ్ టైగర్ రిజర్వ్, అమర్‌కంటక్ ఆలయం, అచానక్‌మార్ టైగర్ రిజర్వ్ వంటి ప్రముఖ పర్యాటక, పుణ్యక్షేత్రాలకు రైలు కనెక్టివిటీ పెరుగుతుందని అంచనా వేసింది. దీంతో పాటు సరుకు రవాణాకు కూడా ఈ ప్రాజెక్టులు ఎంతో ఉపయోగపడనున్నాయి. ముఖ్యంగా బొగ్గు, సిమెంట్, ఇనుము, ఉక్కు వంటి సరుకుల రవాణా సులభతరం కానుంది. దీనివల్ల ఏడాదికి అదనంగా సుమారు 47 మిలియన్ టన్నుల సరుకు రవాణాకు మార్గం సులభతరం అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. సమగ్ర ప్రణాళిక, భాగస్వాముల సంప్రదింపుల ద్వారా బహుళ- రవాణా అనుసంధానాన్ని, లాజిస్టిక్ సామర్థ్యాన్ని పెంపొందించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. పీఎం గతి శక్తి నేషనల్? మాస్టర్ ప్లాన్ ఆధారంగా ఈ ప్రాజెక్టులు ప్రణాళిక రచించారు. ఈ ప్రాజెక్టులు ప్రజలు, వస్తువులు, సేవల రవాణాకు నిరంతరాయ అనుసంధానాన్ని అందిస్తాయని ప్రభుత్వం అభిప్రాయపడింది. రైల్వే నెట్‌వర్క్ పెరగడం వల్ల దేశంలో చమురు దిగుమతులు తగ్గుతాయని అభిప్రాయపడింది. దాదాపు 12 కోట్ల లీటర్ల చమురు దిగుమతి ఆదా అవుతుందని తెలిపింది. అలాగే, 62 కోట్ల కిలోల కార్బన్ దయాక్సైడ్ ఉద్గారాలు తగ్గుతాయని పేర్కొంది.

## విమర్శలను న్యాయవ్యవస్థ వ్యతిరేకించదు

(మొదటిపేజీ తరువాయి)

అనే అంశాన్ని ప్రవేశపెట్టడంపై సుమోటోగా స్వీకరించి కేసుపై విచారణను ముగిస్తూ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. "న్యాయవ్యవస్థ విమర్శలను వ్యతిరేకించదు. వ్యతిరేకించజాల దు. ఒక శక్తివంతమైన రాజ్యాంగ ప్రజాస్వామ్యంలో న్యాయ వ్యవస్థ పనితీరుపై నిష్పక్షపాతమైన, సమాచారంతో కూడిన, నిర్మాణాత్మకమైన విమర్శలు చేయాలి. ఆ విమర్శలు వ్యవస్థ జవాబుదారీతనానికి, స్వీయ సవరణకు దోహదపడతాయి. న్యాయవ్యవస్థపై విమర్శలు సరైన వేదిక ద్వారా నిష్పక్షపాతమైన, హేతుబద్ధమైన యంత్రాంగంలో వినిపించాలి. అంతేగానీ సున్నితమైన మనసుల కోసం ఉద్దేశించిన పాఠశాల పాఠ్యప్రణాళికలోకి ధ్రువీకరణ లేకుండా ప్రవేశించకూడదు" అని సుప్రీంకోర్టు పేర్కొంది.ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదలైన 8వ తరగతి సోషల్ సైన్స్ పుస్తకంలోని ఛాప్టర్ 4 అయిన 'ది రోల్ ఆఫ్ ది జ్యుడిషియరీ ఇన్ సొసైటీ (సమాజంలో న్యాయ వ్యవస్థ పాత్ర)' అధ్యాయంలో న్యాయ వ్యవస్థలో అవినీతి, కేసుల పెండింగ్, మౌలిక వసతుల కొరత, న్యాయమూర్తుల కొరత వంటి అంశాలు ఉండటంతో వివాదం మొదలైంది. ఈ అధ్యాయం న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉందని అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. దీనిపైనే సుప్రీం కోర్టు సుమోటాగా విచారణ చేపట్టి ఎన్‌సీఈఆర్‌టీపై మండిపడింది. అనంతరం సోషల్ సైన్స్ బుక్‌కు సంబంధించిన ముద్రణ పూర్తైన, అలాగే డిజిటల్ కాపీలన్నింటినీ వెంటనే ఉపసంహరించుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇంకా ఆ పుస్తకాన్ని మళ్లీ ముద్రించడం, డిజిటల్ రూపంలో ప్రచురించడం లేదా పంపిణీ చేయడంపై పూర్తి నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో ఎన్‌సీఆర్‌టీపై దేశ అత్యున్నత న్యాయస్థానంలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో సుప్రీంకోర్టుకు ఎన్‌సీఈఆర్‌టీ క్షమాపణలు చెప్పింది. అనంతరం ఎన్‌సీఈఆర్‌టీ సోషల్ సైన్స్ బుక్‌ను సవరించింది. ఈ క్రమంలో పలు మార్పులు చేసింది. 'స్వతంత్ర న్యాయ వ్యవస్థ ఎందుకు అవసరం?' అనే ప్రారంభ ప్రశ్నను తొలగించి



'న్యాయబద్ధమైన, సామరస్యపూర్వకమైన సమాజం కోసం అసలు న్యాయం ఎందుకు అవసరం? అనే కోణంలో కొత్త అంశాన్ని చేర్చింది. ఇంకా 'న్యాయ వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే విభాగాన్ని పూర్తిగా తొలగించింది. అందులో కోర్టుల్లో న్యాయమూర్తుల కొరత, క్లిష్టమైన న్యాయ ప్రక్రియ, బలహీనమైన మౌలిక వసతులే కారణమని ఉంది. ఈ అంశాన్ని పుస్తకం నుంచి తొలగించింది. అసలు ఈ వివాదానికి కేంద్ర బిందువుగా ఉన్నటువంటి న్యాయ వ్యవస్థలో అవినీతి అనే విభాగాన్ని కూడా పూర్తిగా తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది. కొత్త అధ్యాయంతో కూడిన కొత్త ఎన్‌సీఈఆర్‌టీ బుక్‌ను విద్యార్థులకు పంపిణీ చేశారని సెప్టెంబరు 1న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు తెలియజేశారు. దీంతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఎన్‌సీఈఆర్‌టీ బుక్ వివాదం సివిల్ సుమోటో రిట్ పిటిషన్‌ను మూసివేసింది. కాగా, కేంద్రం ఏర్పాటు చేసిన నిపుణుల బృందం సూచించిన సవరణల ఆధారంగా వివాదాస్పద అధ్యాయాన్ని ఎన్‌సీఈఆర్‌టీ మార్చిందని సుప్రీంకోర్టు గమనించింది. కేంద్ర ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీకి సుప్రీంకోర్టు (రిటైర్డ్) జడ్జి జస్టిస్ ఇందు మల్హోత్రా నేతృత్వం వహించారు. ఈ కమిటీలో సీనియర్ న్యాయవాది, భారతదేశ మాజీ అటార్నీ జనరల్ కె.కె. వేణుగోపాల్, ప్రొఫెసర్ ప్రకాశ్ సింగ్ ఉన్నారు.

## బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరు

(మొదటిపేజీ తరువాయి)

ముగిసిన వెంటనే బీజేపీ అధిష్ఠానం దృష్టి పూర్తిగా తెలంగాణపైనే ఉంటుందని, రాష్ట్రాన్ని దక్కించుకోవడమే తదుపరి లక్ష్యమని వెల్లడించారు. భద్రాచలంలో నిర్వహించిన బీజేపీ కార్యకర్తలు, నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఒక కాంగ్రెస్ మంత్రి ఢిల్లీకి అక్రమ మార్గాల్లో మూటలు పంపుతున్నారని, గతంలో కేసీఆర్ పాలనలోనూ అదే మంత్రి బీజేపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి తీవ్రంగా వేధించారని బండి సంజయ్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో ఇస్తున్న ఉచిత సన్న బియ్యం, ఇళ్ల పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం తమ సొంత పథకాలుగా ప్రచారం చేసుకుంటూ ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. గతంలో రజాకార్ల పాలనను తలపించిన కేసీఆర్ సర్కార్ మెడలు వంచింది బీజేపీయేనని గుర్తుచేశారు. "నాపై 109 అక్రమ కేసులు నమోదు చేసినా నేనెప్పుడూ వెనకడుగు వేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై కార్యకర్తలు సైనికుల్లా పోరాడాలి. పోలీసు కేసులకు అస్సలు భయపడాల్సిన అవసరం లేదు" అని భరోసా ఇచ్చారు. దేశాన్ని సుదీర్ఘకాలం ఏలిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం కేవలం నాలుగు రాష్ట్రాలకే పరిమితమైందని, తెలంగాణలో కూడా ఆ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

## కడుపు మండి మాట్లాడా!

(మొదటిపేజీ తరువాయి)

నేతలు అత్యంత అసభ్యకరంగా, కులాల పేరుతో దూషిస్తూ లక్ష్మణరేఖ దాటుతున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష నేతల బూతులు వినలేక టీవీలు చూస్తున్న మహిళలు చెవులు మూసుకుంటున్నారని, బీఆర్ఎస్ నేతలు వారి సొంత కుటుంబ సభ్యులు కూడా తలదించుకునేలా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలోనే అసెంబ్లీకి రాకుండా దూరంగా ఉంటున్న కేసీఆర్ వెంటనే సభకు వచ్చి ప్రజా సమస్యలపై చర్చలో పాల్గొనాలని కోరే క్రమంలో కడుపు మండి మాట్లాడాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. తెలంగాణ నాలుగు కోట్ల ప్రజలదని, కేసీఆర్ కుటుంబానికి మాత్రమే సొంతం కాదని వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వైఖరిని కూడా ఎమ్మెల్యే శంకర్ తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీని ఉద్దేశించి, "ఎక్కడ సచ్చిండు రాహుల్ గాంధీ?" అంటూ మూడు రోజుల క్రితం కరీంనగర్ పర్యటనలో కేటీఆర్ మాట్లాడిన వీడియో క్లిప్పింగ్‌లను ఆయన మీడియా సమక్షంలో ప్రదర్శించారు. కాంగ్రెస్ అగ్రనేతలపై అంతటి దిగజారుడు పదజాలాన్ని ఉపయోగించిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు తమకు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.



## శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్

(మొదటిపేజీ తరువాయి)

అడ్డు తగిలారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగించారు. దీంతో వారిని సభ నుంచి సస్పెండ్ చేయాలని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రతిపాదించారు. దీంతో స్పీకర్ సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం స్పీకర్‌ను కలిసేందుకు వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మార్షల్స్ అడ్డుకున్నారు. భాపతికి చేయాల్సిన అవమానాలన్నీ బీఆర్ఎస్ నేతలు చేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. అవమానాలు కొనసాగించే పరిస్థితి మానుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు. సభాపతి సూచన చేస్తే వాదన పెట్టుకోకుండా సభ సజావుగా నడిచేలా చూడాలన్నారు. వెల్‌లోకి వచ్చి చేయాల్సిన అవమానాలన్నీ చేసి స్పీకర్‌పై సవాల్ విసురుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మగౌరవానికి భంగం కలిగించే ప్రయత్నం చేయొద్దని కోరారు. విభజన తీసుకురావడానికి మరో ప్రయత్నం మంచిది కాదని, సభాపతితో పాటు వారి తల్లిని దూషిస్తే నిరసనలు తెలిపారని అన్నారు. నిన్న నిరసనలో భాగంగా దళిత సంఘాలు ఎర్రవల్లిలోని రోడ్డుపై నడిస్తే అక్కడ పసుపు నీళ్లతో శుద్ధి చేశారని భట్టి విక్రమార్క ఆవేదన వ్యక్తం చేశారు. పసుపు నీటితో రోడ్డు శుద్ధి చేసి అవమానించడమే కాకుండా న్యాయం కావాలంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. న్యాయం కావాల్సింది బలహీనవర్గాలు, దళిత, గిరిజనులకని పేర్కొన్నారు. బీఆర్ఎస్ చేతుల్లో అవమానానికి గురవుతున్న పేద ప్రజలకు న్యాయం జరగాలని చెప్పారు. విపక్ష నేతల ఆగడాలు, అవమానాలను ప్రభుత్వం సంయమనంతో భరిస్తోందని చెప్పారు. రాష్ట్రాన్ని విపక్ష నేతలు ఏం చేయాలనుకుంటున్నారని ప్రశ్నించారు. దొరతనం పోకడలను భరించడానికి తెలంగాణ రాష్ట్రం సిద్ధంగా లేదని ఘాటుగా స్పందించారు.

# ఆయుష్ విద్యార్థులకు సర్కార్ గుడ్‌న్యూస్

- స్టైఫండ్స్ భారీగా పెంచుతూ జీవో జారీ
- సెక్రటేరియట్‌లో మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన స్టూడెంట్స్
- జీవో కాపి అందజేసిన ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

**హైదరాబాద్, సెప్టెంబర్ 09 :** ఆయుర్వేదం, హోమియోపతి, యునాని, నేచరోపతి విభాగాల్లోని హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థుల స్టైఫండ్లను భారీగా పెంచుతూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఇప్పటివరకు హౌస్ సర్జన్లకు నెలకు రూ.13,754గా ఉన్న స్టైఫండ్‌ను రూ.29,792కు పెంచారు. పీజీ విద్యార్థుల స్టైఫండ్ 34,385 నుంచి 74,482కు పెరిగింది. స్టైఫండ్ పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూ ఆయు-ష్ విద్యార్థులు, డాక్టర్లు బుధవారం మధ్యాహ్నం, సచివాలయంలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి విద్యార్థులకు పెంచిన స్టైఫండ్‌కు సంబంధించిన జీఓ కాపీని అందజేశారు. గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్కసారి కూడా తమ స్టైఫండ్ పెంచలేదని, దీంతో ఆయుష్ విద్యార్థులు ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటిది ఇప్పుడు అల్లోపతి మెడికోలతో సమానంగా తమ స్టైఫండ్‌ను పెంచడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. తమ సమస్యను పరిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు ఆయుష్ విద్యార్థులు, డాక్టర్ల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన మంత్రి దామోదర్ రాజనర్సింహ వారికి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు భవిష్యత్‌లో మంచి వైద్యులుగా ఎదిగి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. యువతే దేశ భవిష్యత్తు.. విద్యార్థులే భావి పౌరులు అని మంత్రి అన్నారు. విద్య అనేది కేవలం ఉద్యోగం కోసం మాత్రమే కాదని, వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజంలో గుణాత్మక మార్పుకు విద్య పునాది అని పేర్కొన్నారు. గత రెండున్నరేళ్లలో రాష్ట్రంలో ఆయుష్ వైద్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక కీలక చర్యలు చేపట్టిందని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 700 మంది యోగా ఇన్‌స్ట్రక్టర్లను నియమించి, ప్రజలకు యోగా, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. ఆయుర్వేదం, హోమియోపతి, యునాని విభాగాల్లో 138 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించి, ఆయుష్ వైద్య విద్య, బోధన వ్యవస్థను మరింత బలోపేతం చేశామని పేర్కొన్నారు. సిద్ధిపేట్, జయశంకర్ భూపాలపల్లి, వికారాబాద్ జిల్లాల్లో 50 పడకల ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆసుపత్రులను ఏర్పాటు చేసి, ఆయుష్ వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేశామని తెలిపారు. కరీంనగర్‌లో రూ.15 కోట్ల వ్యయంతో 50 పడకల ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆసుపత్రి నిర్మాణాన్ని చేపట్టామని మంత్రి తెలిపారు. ఈ హాస్పిటల్ ద్వారా ఆయుష్ వైద్య సేవలను మరింత విస్తరించే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలోని ఆయుష్ ఆసుపత్రులు, క్లినిక్‌లను దశలవారీగా అప్‌గ్రేడ్ చేస్తూ, మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఆయుష్ వైద్య విధానాలకు ప్రజల్లో మరింత ఆదరణ పెరిగేలా విద్యార్థులు, యువ వైద్యులు కృషి చేయాలని మంత్రి సూచించారు. ఆయుష్ వైద్య విధానాలపై శాస్త్రీయ పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలని, కొత్త చికిత్సా విధానాలు, ఔషధాలపై పరిశోధన చేసి ఆయుష్ వైద్య విధానాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. "మీరు చదువుతో ఆగిపోవద్దు.. పరిశోధన వైపు కూడా అడుగులు వేయాలి. మన సంప్రదాయ వైద్య విజ్ఞానాన్ని ఆధునిక పరిశోధనతో అనుసంధానం చేసి ప్రపంచానికి పరిచయం చేయాల్సిన బాధ్యత యువ వైద్యులపై ఉంది" అని మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. పేదలు, గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఆయుష్ వైద్యులు కీలక పాత్ర పోషించాలని మంత్రి సూచించారు. విద్య, వైద్యం, సంక్షేమ రంగాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించడంతో పాటు వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు.

## సొంత నేతలే మహిళా ఎమ్మెల్యేలను తోసేశారు

**రాష్ట్ర మంత్రి సీతక్క సంచలన ఆరోపణలు**



**హైదరాబాద్, సెప్టెంబర్ 09 :** తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద ఇటీవల చోటు చేసుకున్న పరిణామాల్లో బుధవారం మరో కీలక మలుపు చోటుచేసుకుంది. సొంత పార్టీకి చెందిన కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ తోటి మహిళా సభ్యుల పట్ల అమర్యాదగా ప్రవర్తించారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సంచలన ఆరోపణలు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలను కూడా ఆమె మీడియాకు విడుదల చేశారు. మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవ లక్ష్మిలను వారి పార్టీకే చెందిన ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, సుధీర్ రెడ్డి వెనుక నుంచి నెట్టేశారని సీతక్క ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేలను పక్కకు తోసేసి గంగుల కమలాకర్ ముందుకు వెళ్లడం సిగ్గుచేటని ఆమె వ్యాఖ్యానించారు. సొంత పార్టీ మహిళా ఎమ్మెల్యేల పట్ల పురుష ఎమ్మెల్యేలు ఇలా దురుసుగా ప్రవర్తించాల్సిన అవసరం ఏమొచ్చిందని ఆమె ప్రశ్నించారు. గత సోమవారం నల్ల చొక్కాలు ధరించి నిరసన తెలిపిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అసెంబ్లీ గేటు వద్ద అడ్డుకున్న సమయంలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. తమ మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు చేయి చేసుకున్నారని బీఆర్ఎస్ ఆరోపిస్తుండగా, తాజాగా మంత్రి సీతక్క చేసిన ఆరోపణల ఈ వివాదాన్ని మరో మలుపు తిప్పాయి. మరోవైపు, విధులకు ఆటంకం కలిగించడం, మహిళా పోలీసుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం వంటి అభియోగాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావు సహా పలువురు ఎమ్మెల్యేలపై పోలీసులు ఇప్పటికే రెండు కేసులు నమోదు చేశారు. కొందరు ఎమ్మెల్యేలు తమ ఎదుట చొక్కాలు విప్పి అర్ధనగ్నంగా నిలబడ్డారని, తమను నెట్టివేసి తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని ఓ మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే మంత్రి సీతక్క, బీఆర్ఎస్ నేతల దాడిలో గాయపడిన మహిళా పోలీసు సిబ్బందిని పరామర్శించారు. మహిళల గౌరవానికి భంగం కలిగించే చర్యలను తమ ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోదని ఆమె స్పష్టం చేశారు. కాగా, మంత్రి సీతక్క విడుదల చేసిన ఫొటోలు, వీడియోలు మార్ఫింగ్ చేసినవని, అవి ఏఐ-జనరేటెడ్ అని బీఆర్ఎస్ నేతలు కొట్టిపారేశారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేపై కేసు నమోదు

**హైదరాబాద్, సెప్టెంబర్ 09 :** మహిళా పోలీసుల విధులకు ఆటంకం కలిగించి దుర్భాషలాడి, బెదిరించారన్న ఘటనపై కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురు బీఆర్ఎస్ నాయకులపై సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సోమవారం అసెంబ్లీ గేట్ నంబర్ 03 వద్ద జరిగిన ఘటనపై మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదుతో దీచీ 74, 75(1), 79, 121(1), 130, 132, 296, 351(2), 352 తీ/ఖ 3(5) సెక్షన్ల కింద బీఆర్?ఎస్ నాయకులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మహిళా పోలీసుల విధులకు ఆటంకం కలిగించి దుర్భాషలాడి, బెదిరించారని ఫిర్యాదులో బాధిత పోలీసు సిబ్బంది వెల్లడించారు. మహిళా పోలీసులను ఉద్దేశించి బీఆర్ఎస్ నేతలు అనుచిత వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మహిళా పోలీసులు అని చూడకుండా తమ ఎదుట టీషర్టులు విప్పి అర్ధనగ్నంగా నిలబడ్డారని ఫిర్యాదులో ఆవేదన వ్యక్తం చేశారు. విధులు నిర్వర్తించకుండా అడ్డుకుని బెదిరించినట్లు వివరించారు. ఈ ఘటనకు సంబంధించిన సీసీటీవీ, వీడియోలు, ఫొటోలు, వైద్య రికార్డులు పరిశీలించాలని ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ ప్రవర్తన దురుసుగా ఉందని తెలిపారు. మహిళా పోలీసులను నెట్టడంతో ఇబ్బంది కలిగించారని ఆరోపణలు చేశారు. ఈ ఘటనతో తమకు తీవ్ర మానసిక వేదన, అవమానం కలిగిందని తెలిపారు. ఘటన అనంతరం మహిళా పోలీసులకు ఆసుపత్రిలో వైద్య చికిత్సలు చేసినట్లు వివరించారు. కేటీఆర్, హరీశ్‌రావు, సుధీర్ రెడ్డి, నవీన్ రెడ్డి సహా పలువురిపై కేసు నమోదైంది. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తొలి రోజు కాంగ్రెస్ విఫలమైందంటూ నినాదాలున్న నల్ల టీషర్టులతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీ లోపలికి వెళ్లేందుకు యత్నించడంతో వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ బీఆర్ఎస్ నేతలకు పోలీసులకు మధ్య తోపులాట చేసుకుంది. ఒక రకంగా యుద్ధ వాతావరణాన్ని తలపించింది. తమను ఎందుకు లోపలికి అనుమతించడం లేదని హరీశ్‌రావు పోలీసులను ప్రశ్నించారు.దానికి బదులుగా టీషర్టులపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు ఉన్నాయని, వాటికి అనుమతి లేదని స్పీకర్ ఆదేశాలిచ్చారని స్పందనగా పోలీసులు తెలిపారు. దీంతో ఆగ్రహావేశాలతో హరీశ్ రావుతో పాటు పులువురు నేతలు అక్కడే టీషర్టులు తీసేసి బనియన్లతో నిరసన తెలిపి లోపలికి పంపించాలని వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీసులకు బీఆర్ఎస్ నేతలకు తీవ్రంగా తోపులాట జరిగి వివాదానికి దారి తీసింది. ఇక్కడే పోలీసులపై బీఆర్ఎస్ నేతలు విరుచుకుపడ్డారు. దీంతో అక్కడే ఉన్న మహిళా పోలీసులకు తీవ్ర అసౌకర్యం కలిగింది. దానికి సంబంధించిన ఫొటోలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశం అయ్యాయి. దీనిపై తాజాగా కేసులు రిజిస్టర్ అయ్యాయి. మహిళా పోలీసులకు సంబంధించిన ఘటనపై మంత్రి సీతక్క విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్న నేపథ్యంలో బీఆర్?ఎస్ నేతలపై కేసులు నమోదు అయ్యాయి.

## బీఆర్ఎస్ చేసిన శుద్ధీకరణపై గవర్నర్‌కు ఫిర్యాదు

**లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన మంత్రులు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 09 :** లోక్‌భవన్‌లో గవర్నర్ శివ్‌కుమార్ శుక్లాను పలువురు మంత్రులు కలిశారు. బీఆర్ఎస్ నాయకులు చేసిన శుద్ధీకరణపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. అసెంబ్లీ తొలిరోజు లోపలికి ప్రవేశించే సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వ్యవహరించిన తీరు... స్పీకర్‌ను అవమానపర్చేవిధంగా మాట్లాడిన తీరును మంత్రులు గవర్నర్‌కు వివరించారు. గవర్నర్‌ను కలిసిన వారిలో ఉపముఖ్యమంత్రి భట్టి, మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ ఉన్నారు. బీఆర్ఎస్ పార్టీ దొర అహంకారంతో వ్యవహరిస్తోందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ విమర్శించారు. శాసనసభ స్పీకర్, అతని తల్లిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు దూషించారని... దీన్ని నిరసిస్తూ కేసీఆర్ ఫామ్ హౌజ్ దగ్గర డప్పులతో దళితులు నిరసన తెలిపిన ప్రాంతాన్ని శుద్ధి చేయడం కేసీఆర్ దళిత వ్యతిరేక విధానాలకు నిదర్శనమని అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. ఈ రెండు ఘటనలపై డిప్యూటీ సీఎం భట్టి నేతృత్వంలో పలువురు మంత్రులు... గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లా దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. దళితులు ప్రజాస్వామ్యంగా నిరసన తెలిపితే కేసీఆర్ అవమానించారు, తన ఫామ్‌హౌస్ రోడ్డులో దళితులు నడిచారని కేసీఆర్ శుద్ధి చేయించారు. కేసీఆర్ చూపించిన అంటరానితనంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశాం. బీఆర్ఎస్ నేతలు స్పీకర్, స్పీకర్ తల్లిని కూడా దూషించారు. బీఆర్ఎస్ నేతలు చేసిన శుద్ధీకరణపై కేసీఆర్ ఇప్పటికైనా స్పందించాలి. దళితులను అవమానించటం కేసీఆర్ ఆదేశాలతోనే జరుగుతున్నదా?, కేసీఆర్ ఆదేశించకపోతే ఎందుకు మాట్లాడటం లేదని అన్నారు. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల ఫిర్యాదుపై స్పీకర్ స్పందించారని, ఘటనపై విచారణకు ఆదేశించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారని లక్ష్మణ్ తెలిపారు. ప్రజాపాలనలో అంటరానితనానికి తావు లేదని, ఇలాంటి కుల వివక్ష ఘటనలను సహించబోమని అడ్లూరి ప్రకటించారు. బీఆర్ఎస్ నేతల తీరును గవర్నర్‌కు వివరించడం కోసమే తాము లోక్‌భవన్‌కు వెళ్లినట్లు ఆయన తెలిపారు. మరోవైపు ఉదయం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కేటీఆర్ నేతృత్వంలో గవర్నర్‌ను కలిసి అసెంబ్లీలో తొలి రోజు వివాదం, తమ సస్పెన్షన్ గురించి వివరించారు.

## అసెంబ్లీలో ఏలేటి వ్యాఖ్యలపై దుమారం

- ఆగ్రహం వ్యక్తం చేసిన అధికారపక్షం
- సజావుగా సాగడం ఇష్టంలేదని వ్యాఖ్యలు
- శాసనసభ నుంచి వాకౌట్ చేసిన బీజేపీ
- స్పష్టమైన అజెండా తర్వాతే సభకు..
- బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబర్ 09 :** బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలతో అసెంబ్లీలో దుమారం రేగింది. సభలోలేని సభ్యులను సస్పెండ్ చేయడం బాధాకరమని అన్నారు. సభ ఉల్లంఘన జరిగినపుడు బీజేపీ శాసనసభపక్ష నేతగా కొన్ని అంశాలను ప్రస్తావించాల్సిన అవసరం ఉందని అసెంబ్లీలో పేర్కొన్నారు. ఏ నియమ నిబంధనల ప్రకారంగా సస్పెండ్ చేశారని ప్రశ్నించారు. కొత్తగా ఏమైనా పుస్తకం తయారు చేసుకున్నారా ప్రశ్నించారు. గ్రామాల్లో ఏడు గంటల కరెంట్ కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. బీఏసీలో చెప్పినట్లు సభ నడుపుతారా లేదా రాష్ట్రంలో అనేక సమస్యలపై చర్చించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 22ఏ పై ఎప్పుడూ చర్చిస్తారో చెప్పే వరకు సభలో మా ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలపై అధికార పార్టీ సభ్యులు మండిపడ్డారు. భలో లేనివారిని సస్పెండ్ చేయడం దారుణం. ఇష్టానుసారం సస్పెండ్ చేయడం బాధాకరం. రైతు సమస్యలపై చర్చ ఉంటుందని ప్రభుత్వం హామీ ఇచ్చింది. బీఏసీలో చెప్పిన ప్రకారం సభ నడుపుతారా అని అన్నారు. సభ ఔన్నత్యాన్ని కాపాడటం మనందరి బాధ్యతన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సభ స్థానంలో ఉన్న వారి గౌరవాన్ని కాపాడేలా మాట్లాడాలని హితవు పలికారు. ఏ అంశంపైనైనా చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్న మంత్రి శ్రీధర్‌బాబు సభ కార్యక్రమాలను నిరంతరం అడ్డుకోవడం సమంజసమా అని మంత్రి శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. సభ సజావుగా సాగడం బీజేపీ సభ్యులకు ఇష్టం లేనట్లుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని రోజులైనా సభ నడిపేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. దళిత వర్గాలు, బలహీనవర్గాల హక్కులను కాపాడాలని సూచించారు. సామాజిక న్యాయం చేయాలని లేకపోతే ఏమనాలని ప్రశ్నించారు. విద్యాశాఖలో తెచ్చిన సంస్కరణలపై చర్చకు సిద్ధంగా ఉన్నామని, 22ఏ సమస్యపైనా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేస్తున్నామని వెల్లడించారు. బీజేపీ సభ్యుల వైఖరి మార్చుకుంటేనే మరింత ఎదుగుతారని మంత్రి పొన్నం ప్రభాకర్ హితవు పలికారు. దళితులను అవమానించినవారిని సమర్థించడం మంచి పద్ధతి కాదని సూచించారు. తెలంగాణ ప్రయోజనాల కోసం కొట్లాడితే వారిని మెచ్చుకోవచ్చని పేర్కొన్నారు.సభ సజావుగా జరగడం బీజేపీ సభ్యులకు ఇష్టంలేదన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సభ్యసమాజం తలదించుకునేలా స్పీకర్‌పై ఇష్టానుసారం మాట్లాడతారా అని నిలదీశారు. నిరసన కార్యక్రమం చేస్తుంటే శుద్ధి చేయడం మంచి పద్ధతా? అని ప్రశ్నించారు. ఎర్రవల్లిలో దళితులు కార్యక్రమం చేసిన చోట శుద్ధి చేయడాన్ని ఏమనాలని?, ఖర్గే కూర్చున్న వేదికను ఎందుకు శుద్ధి చేశారో సమాధానం చెప్పాలని బీజేపీ సభ్యులను డిమాండ్ చేశారు. శాసనసభ నుంచి బీజేపీ వాకౌట్ చేసింది. ప్రభుత్వం అజెండా అంశాలను ముందే ఇవ్వట్లేదని బీజేపీ ఎమ్మెల్యేలు ఆరోపించారు. స్పష్టమైన అజెండా ఇచ్చిన తర్వాతే సభ వస్తామని బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.

## సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్

**తమిళనాడులో కొత్త కూటమికి సన్నాహాలు**

**విజయ్ నాయకత్వంలో ఏర్పాటుకు సిద్ధం**

**చెన్నై, సెప్టెంబర్ 09 :** తమిళనాడులో కొత్త రాజకీయాల్లో కీలక పరిణామం జరిగింది. తమిళగ వెట్రి కళగం (టీవీకే) నేతృత్వంలోని కొత్త కూటమి ఆవిర్భవించింది. దానికి "సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్" అని పేరు పెట్టారు. చెన్నైలోని పనైయూర్‌లో ఉన్న పార్టీ ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన రెండో కూటమి సమన్వయ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ పేరే తమ కూటమి సిద్ధాంతాలను, అజెండాను తెలియజేస్తోందని తమిళనాడు పీసీసీ అధ్యక్షుడు మాణికం ఠాగూర్ తెలిపారు. తమిళనాడు హక్కుల కోసం పోరాడే పార్టీలన్నీ ఈ కూటమిలో ఉన్నాయని ఆయన చెప్పారు. త్వరలో జరిగే ఉపఎన్నికల్లో కూటమి ఉమ్మడిగా పోటీచేస్తుందని మాణికం ఠాగూర్ ప్రకటించారు. లౌకికవాదం, సామాజిక న్యాయం, రాష్ట్ర హక్కుల సాధనే ధ్యేయంగా బరిలోకి దిగనున్న కొత్త కూటమి త్వరలో జరిగే ఉపఎన్నికల్లో సత్తా చాటేందుకు వ్యూహరచన చేస్తోంది. టీవీకే వ్యవస్థాపకుడు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ అధ్యక్షతన జరిగిన ఈ కీలక సమావేశంలో కాంగ్రెస్, విదుతలై చిరుతైగల్ కట్చి (వీసీకే), మరుమలర్చి ద్రవిడ మున్నేట్ర కజగం (ఎండీఎంకే), ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐఎంయూఎల్) వంటి కీలక భాగస్వామ్య పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు

- ఇరాన్ చమురు ట్యాంకర్లపై దాడులు
- దాడులకు ప్రతిదాడులు చేసిన ఇరాన్
- అమెరికా అండర్ వాటర్ డ్రోన్ సీజ్



**ఒమన్ గల్ఫ్, సెప్టెంబర్ 09 :** అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇరాన్‌కు చెందిన ఐదు ముడి చమురు రవాణా నౌకలపై అమెరికా బలగాలు దాడులు నిర్వహించినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంటకామ్) వెల్లడించింది. మంగళవారం చేపట్టిన ఈ దాడుల్లో నాలుగు నౌకలు పూర్తిగా ధ్వంసమైనట్లు, మరో నౌక దెబ్బతిన్నట్లు తెలిపింది. అమెరికా యుద్ధనౌకపై ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) 48 గంటల్లో రెండుసార్లు బాలిస్టిక్ క్షిపణులతో దాడికి ప్రయత్నించడంతో ప్రతీకార చర్యగా ఈ దాడులు చేపట్టినట్లు సెంట్కామ్ పేర్కొంది. సెంటకామ్ ప్రకటన ప్రకారం, ఒమన్ గల్ఫ్‌లో ఇరాన్‌కు చెందిన నాలుగు ముడి చమురు రవాణా నౌకలు దాడుల్లో ధ్వంసమయ్యాయి. డెర్యా ఖార్గ్ ద్వీపం సమీపంలో దెబ్బతిన్నట్లు అమెరికా సైనిక కమాండ్ తెలిపింది. దాడికి సంబంధించిన దృశ్యాలను కూడా విడుదల చేసింది. ఈ దాడులకు ముందు ఐదు నౌకల్లోని సిబ్బందిని ఖాళీ చేయాలని అమెరికా బలగాలు ప్రత్యక్ష ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించింది. మానవ ప్రాణనష్టాన్ని నివారించేందుకు ముందస్తు హెచ్చరికలు ఇచ్చినట్లు పేర్కొంది. ఇరాన్ ప్రభుత్వ అనుబంధ నౌకాదళానికి చెందిన ఈ నౌకలు, టెహ్రాన్ భద్రతా వ్యవస్థకు ఆర్థికంగా కీలకమైనవని అమెరికా పేర్కొంది. గత 48 గంటల్లో ఇరాన్? ఒక అమెరికా నావికాదళ యుద్ధనౌకను రెండుసార్లు బాలిస్టిక్ క్షిపణులతో లక్ష్యంగా చేసుకునేందుకు ప్రయత్నించిందని యుఎస్? సెంట్రల్? కమాండ్ తెలిపింది. అయితే ఆ రెండు దాడులను అమెరికా యుద్ధనౌక విజయవంతంగా తప్పించుకున్నట్లు వెల్లడించింది. ఈ ఘటనలో అమెరికా సిబ్బందికి ఎలాంటి గాయాలు కాలేదని, యుద్ధనౌక కార్యకలాపాలకు కూడా ఎలాంటి నష్టం జరగలేదని వెల్లడించింది. దాడి ప్రయత్నాల తర్వాత కూడా ఆ యుద్ధనౌక ప్రాంతీయ జలాల్లో గస్తీ కొనసాగిస్తోందని పేర్కొంది. సెప్టెంబర్ 5న కూడా ఐఆర్?జీసీ అమెరికా విమాన వాహక నౌక, గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్‌పై దాడికి ప్రయత్నించిందని సెంట్కామ్ తెలిపింది. ఆ దాడి ప్రయత్నం విఫలమైన తర్వాత మూడు ఇరాన్ ముడి చమురు రవాణా నౌకలను అమెరికా బలగాలు ధ్వంసం చేశాయని పేర్కొంది. తాజాగా మరో ఐదు నౌకలపై చర్యలు చేపట్టినట్లు వెల్లడించింది. దాడులకు గురైన నౌకలు సాధారణ వాణిజ్య రవాణా వ్యవస్థలో భాగం కాదని అమెరికా సైనిక కమాండ్ ఆరోపించింది. ఇవి ఐఆర్జీసీ, దాని ప్రాంతీయ మిత్ర బలగాలకు నిధులు సమకూర్చే బహుళ బిలియన్ డాలర్ల రహస్య నెట్‌వర్క్‌లో భాగమని పేర్కొంది. ఇరాన్ తన భద్రతా వ్యవస్థను కొనసాగించేందుకు చమురు ఆదాయంపై ఆధారపడుతోందని అమెరికా చెబుతోంది. ఈ నేపథ్యంలో చమురు రవాణా వ్యవస్థను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా ఇరాన్‌పై ఆర్థిక ఒత్తిడి పెంచే ప్రయత్నంగా తాజా దాడులను పరిశీలిస్తున్నారు. మరోవైపు అమెరికా దాడులకు ఇరాన్ తీవ్రంగా స్పందించింది. తమ చమురు ట్యాంకర్లపై అమెరికా దాడులకు ప్రతీకారంగా ఐఆర్?జీసీ సైనిక చర్యలు చేపట్టినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా వెల్లడించింది. జోర్డాన్‌లోని అమెరికా ఆధీనంలోని అల్ అజ్రాక్ వైమానిక స్థావరంపై బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేసినట్లు ఐఆర్జీసీ ప్రకటించింది. అమెరికా నావికాదళానికి చెందిన రెండు డిస్ట్రాయర్లను కూడా లక్ష్యంగా చేసుకున్నట్లు ఇరాన్ పేర్కొంది. ఈ దాడుల్లో ద్రవ, ఘన ఇంధన బాలిస్టిక్ క్షిపణులను ఉపయోగించారని ఆఆర్?జిసి ధ్రువీకరించింది. అమెరికా యుద్ధ విమానాలకు సంబంధించిన హ్యాంగర్లు, రక్షణ షెల్టర్లను లక్ష్యంగా చేసుకున్నట్లు ప్రకటించింది. అమెరికా దాడుల నేపథ్యంలో ఇరాన్ మరో కీలక హెచ్చరిక చేసింది. కువైట్, బహ్రెయిన్ ఓడరేవుల సమీపంలోని చమురు ట్యాంకర్లను లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించింది. పోర్టుల్లో నౌకలు లంగరు వేసి ఉన్నప్పటికీ వాటిపై దాడులు జరిగే అవకాశం ఉందని తెలిపింది. నౌకల్లో పనిచేస్తున్న సిబ్బంది వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని సూచించింది. అమెరికా బలగాలకు కువైట్, బహ్రెయిన్‌లు ఆశ్రయం కల్పిస్తున్నాయని, తమపై జరిగే దాడులకు సహకరిస్తున్నాయని ఇరాన్ ఆరోపించింది. ఈ హెచ్చరికలతో గల్ఫ్ ప్రాంతంలో వాణిజ్య నౌకల భద్రతపై ఆందోళనలు మరింత పెరిగాయి.

## కెనడా ఉత్పత్తులపై అమెరికా నిషేధం

**అమల్లోకి తెచ్చిన ప్రతీకార సుంకాలు**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 09 :** అమెరికా- కెనడా మధ్య వాణిజ్య వివాదం మరింత ముదిరింది. కెనడా విధించిన ప్రతీకార సుంకాలు అమల్లోకి వచ్చిన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. కెనడా నుంచి దిగుమతి అయ్యే వాహనాలు, ఆటో విడిభాగాలు, మద్యం, పాల ఉత్పత్తులపై ఆంక్షలు విధిస్తూ ఏకంగా ఐదు ఉత్తర్వులు జారీ చేశారు. భారీ, దీర్ఘకాలిక అమెరికా ప్రభుత్వ కాంట్రాక్టుల్లో కెనడియన్ ఉత్పత్తులపై నిషేధం వించాలని జనరల్ సర్వీసెస్ అడ్మినిస్ట్రేషన్‌ను ఆదేశించారు. అమెరికా ఉత్పత్తులకు కెనడా పూర్తి న్యాయమైన పరస్పర ప్రయోజనం కల్పించే వరకు ఈ ఆంక్షలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఎంపిక చేసిన కెనడియన్ వాహనాలు, ఆటోమొబైల్ విడిభాగాలను అమెరికాలోకి దిగుమతి చేయకుండా నిషేధించేలా ట్రంప్ తొలి ఉత్తర్వును జారీ చేశారు. కెనడాలోని కొన్ని ప్రావిన్సులు అమెరికా బీర్, వైన్, స్పిరిట్స్ పంపిణీ, రిటైల్ విక్రయాలు, కొనుగోళ్లపై ఆంక్షలు విధిస్తున్నాయని అమెరికా ఆరోపిస్తోంది. దీనికి ప్రతిస్పందనగా కొన్ని కెనడియన్ ఉత్పత్తులపై అదనపు సుంకాలు విధించే పరిధిని మార్చుతూ ట్రంప్ రెండో ఉత్తర్వు జారీ చేశారు. ఎంపిక చేసిన కెనడియన్ డెయిరీ ఉత్పత్తులను అమెరికాలోకి దిగుమతి చేసుకోకుండా నేరుగా నిషేధిస్తూ మూడో ఉత్తర్వు జారీ చేశారు. అమెరికా మద్యం ఉత్పత్తులపై కెనడాలోని ప్రావిన్సులు విధిస్తున్న ఆంక్షలకు ప్రతిగా, ఎంపిక చేసిన కెనడియన్ మద్యం ఉత్పత్తుల దిగుమతులను నిషేధిస్తూ మరో ఉత్తర్వు తీసుకొచ్చారు. మోటార్ వాహనాల వివాదానికి సంబంధించిన అదనపు సుంకాల పరిధిని కూడా ఐదో ఉత్తర్వుతో మార్చారు. ఇదే సమయంలో అమెరికా ప్రభుత్వ ప్రధాన కొనుగోలు వ్యవస్థ నుంచి కెనడియన్ ఉత్పత్తులను తొలగించాలని ట్రంప్ ఆదేశించారు. జనరల్ సర్వీసెస్ అడ్మినిస్ట్రేషన్ (జీఎస్?ఏ), యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ (యూఎస్?టీఆర్)లు ఈ ప్రక్రియను చేపట్టాలని సూచించారు. కెనడా కూడా అమెరికా సంస్థలు, రైతులకు సమానమైన మార్కెట్ అవకాశాలు కల్పించే వరకు ఈ ఆంక్షలు కొనసాగుతాయని ట్రంప్ స్పష్టం చేశారు.

# యుద్ధ విరమణ దిశగా సాగని చర్చలు!!



**రష్యా- ఉక్రెయిన్ మధ్య చాలా కాలంగా యుద్ధం కొనసాగుతూనే ఉంది. యుద్ధ విరమణకు అనేక దఫాలుగా చర్చలు జరిగిన ఎ ఒక్కటీ కొలిక్కిరాలేదు. తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరియు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గంట పాటు ఫోన్ ద్వారా సంభాషించారు. ఈ సంభాషణలో శాంతి చర్చకర్తలైన స్టీవ్ విట్కాఫ్ మరియు జారెడ్ కుష్నర్ రష్యా మరియు ఉక్రెయిన్‌లో చేసిన సందర్శన ఫలితాలను చర్చించారు. ట్రంప్ పుతిన్‌కు ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధానికి త్వరగా ముగింపు కావాలని కోరారు, ఇది అమెరికా-రష్యా సంబంధాలను పూర్తిగా పునరుద్ధరించడానికి సహాయపడుతుందని క్రెమ్లిన్ తెలిపింది. ఈ సందర్భంగా, పుతిన్ యూరోప్ పట్ల రష్యాకు దురాశలు లేవని ట్రంప్‌కు హామీ ఇచ్చారు. పుతిన్ విదేశీ వ్యవహారాల సలహాదారు యూరీ ఉషాకోవ్, పుతిన్ మరియు ట్రంప్ మధ్య జరిగిన ఈ గంటల సంభాషణ 'సంఘటితమైన మరియు చాలా స్పష్టమైనది' అని పేర్కొన్నారు. విట్కాఫ్ మరియు కుష్నర్ చేసిన సందర్శన ఫలితాలను మాస్కో సానుకూలంగా చూస్తుందని ఆయన చెప్పారు.**

డొనాల్డ్ ట్రంప్ యుద్ధాన్ని త్వరగా ముగించాలనే తలంపును స్పష్టంగా వ్యక్తం చేశాడు, ఇది అమెరికా మరియు రష్యా మధ్య సంబంధాలను పునరుద్ధరించడానికి అద్భుతమైన అవకాశాలను తెరవగలదు' అని ఉషాకోవ్ చెప్పారు. 'ఈ దృష్టిలో, ఇది వాణిజ్య మరియు ఆర్థిక సంబంధాలపై ప్రత్యేక ప్రభావం చూపుతుంది, రెండు దేశాలకు భారీ లాభాలను అందించగలదు. ట్రంప్ తన అధ్యక్షతలో ఒక ప్రగతి సాధించాలని ఆసక్తిగా ఉన్నాడు. ఈ దృష్టిని పుతిన్ మద్దతు ఇచ్చారు'. ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధం ముగించేందుకు ట్రంప్ మరియు పుతిన్ మధ్య జరిగిన ఈ సంభాషణలో యూరోపియన్ దేశాల పట్ల రష్యా యొక్క దురాశల గురించి చర్చ జరిగింది. 'యూరోప్ పట్ల మాకు ఏ దురాశలు లేవు' అని ఉషాకోవ్ చెప్పారు. ఈ కాల్‌పై వైట్ హౌస్ లేదా అమెరికా అధ్యక్షుడి నుండి వెంటనే స్పందన లేదు. అమెరికా శాంతి చర్చకర్తలు జారెడ్ కుష్నర్ మరియు స్టీవ్ విట్కాఫ్ మాస్కో మరియు కీవ్‌లో పుతిన్ మరియు ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలొదిమిర్ జెలెన్స్కీతో వేర్వేరు చర్చలకు వెళ్లారు. ఈ సమావేశాలు యుద్ధాన్ని ముగించేందుకు ప్రధానమైన ప్రగతి సాధించలేకపోయాయి, మరియు రెండు దేశాలు శుక్రవారం జరిగిన శాంతి విరమణ తర్వాత తమ వాయు యుద్ధాన్ని కొనసాగించాయి. మంగళవారం స్థానిక అధికారులు తెలిపిన ప్రకారం, రష్యా కీవ్ నగరాన్ని డ్రోన్లు మరియు మిస్సైల్‌లతో బాంబు విసిరినప్పుడు రెండు వ్యక్తులు మరణించారు. మరోవైపు, ఉక్రెయిన్ దాడిలో క్రిమియాలో రెండు వ్యక్తులు మరణించారు.

ఇటీవల నెలలుగా, రష్యా మరియు ఉక్రెయిన్ ఒకదానికొకటి నష్టపరిహారం చెల్లించేందుకు తమ వాయు యుద్ధాన్ని పెంచాయి. ఈ రోజు ముందుగా, రష్యా అధ్యక్షుడి ప్రాతినిధి దిమిత్రి పెస్కోవ్, 'రష్యాకు విజయానికి దగ్గరగా ఉన్నామని' చెప్పారు, 'విజయం చాలా దగ్గరగా ఉంది' అని ఆయన అభిప్రాయపడ్డారు. మరోవైపు అంతర్జాతీయ రాజకీయాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, గ్లోబల్ ఆర్థిక వ్యవస్థ , దౌత్య సంబంధాల నేపథ్యంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య శుక్రవారం కీలక ద్వైపాక్షిక చర్చలు జరగనున్నాయి. ఇరు దేశాల మధ్య వాణిజ్య బంధం, అంతర్జాతీయ రవాణా ప్రాజెక్టులతో పాటు ముఖ్యంగా సుదీర్ఘంగా సాగుతున్న ఉక్రెయిన్ యుద్ధానికి శాంతియుత ముగింపు పలకడమే లక్ష్యంగా ఈ భేటీ సాగనుందని రష్యా అధికారిక కార్యాలయం 'క్రెమ్లిన్' ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ స్పష్టం చేశారు. 11న ఢిల్లీ వేదికగా భారత్ అధ్యక్షతన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం జరగనున్న విషయం తెలిసిందే. ఆ సమావేశానికి ముందే మోదీ - పుతిన్ ఒకరిని ఒకరు కలవబోతున్నారు. అనంతరం ఇరు దేశాల ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొననున్నట్లు రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ ప్రతినిధి పెస్కోవ్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

యుద్ధ పరిష్కారం కోసం భారత్ చూపిస్తున్న నిబద్ధతను, చొరవను రష్యా మనస్ఫూర్తిగా స్వాగతిస్తోందని ఆయన వెల్లడించారు. అసలు తాము ఎప్పుడూ యుద్ధాన్ని కోరుకోలేదని, గతంలో మొదలైన ఈ వివాదానికి శాంతియుతంగా చుక్కాని పెట్టడానికే రష్యా ప్రయత్నిస్తోందని చెప్పారు. రష్యా, ఉక్రెయిన్ , అమెరికా మధ్య మళ్లీ శాంతి చర్చలు ప్రారంభమవుతాయని తాము ఆశిస్తున్నామని, శాంతి పునరుద్ధరణ కోసం భారత్‌తో పాటు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలు కూడా ఆహ్వానించదగినవేనని కొనియాడారు. శాంతి ప్రక్రియ ముందుకు సాగాలంటే కేవలం తమ వైపు నుంచే కాకుండా ఉక్రెయిన్ నుంచి కూడా అంతే సుముఖత ఉండాలని రష్యా స్పష్టం చేసింది. కొన్ని ఐరోపా దేశాలు ఉక్రెయిన్‌ను నిరంతరం రెచ్చగొడుతూ శాంతి చర్చలను పక్కదారి పట్టించేందుకు కుట్ర పన్నుతున్నాయని పెస్కోవ్ సంచలన ఆరోపణలు చేశారు. అయితే ఆ విదేశీ కుట్రలు ఫలించకుండా తాము అడ్డుకుంటామని, శాంతి మార్గంలోనే పరిష్కారాన్ని అన్వేషిస్తామని పునరుద్ఘాటించారు. ఈ ఇరువురి భేటీలోనైనా రష్యా యుద్ధం ముగింపుకు స్వస్తి పలకాలని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# యాప్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేయం

- ఎరువుల పంపిణీలో పారదర్శకత కోసమే యాప్
- రైతాంగ విస్తృత ప్రయోజనాలకై కొనసాగింపు
- సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తున్నాం..
- శాసనమండలిలో మంత్రి తుమ్మల సమాధానం



**హైదరాబాద్, సెప్టెంబర్ 09 :** యూరియా, ఇతర సబ్సిడీ ఎరువులు నిజమైన రైతులకు పారదర్శకంగా, అవసరమైన మేరకు అందించడమే లక్ష్యంగా తీసుకొచ్చిన యాప్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేసే ప్రసక్తే లేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు స్పష్టం చేశారు. యాప్ అమలులో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని, భవిష్యత్‌లో రైతులకు మరింత సులభంగా, సమర్థవంతంగా సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ రోజు శాసనమండలిలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నలకు మంత్రి తుమ్మల సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు యూరియా సరఫరా, యాప్ ద్వారా బుకింగ్, కౌలు రైతుల ఇబ్బందులు, సొసైటీలకు యూరియా రవాణా చార్జీలు, సాంకేతిక సమస్యలు తదితర అంశాలను ప్రస్తావించారు. వాటిపై మంత్రి సమగ్రంగా వివరణ ఇచ్చారు. గతంలో ఆధార్ ఆధారంగా ఎరువుల పంపిణీ జరిగేదని మంత్రి తెలిపారు. అయితే సబ్సిడీపై లభించే ఎరువులు భూమిని వాస్తవంగా సాగు చేస్తున్న రైతులకే అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందన్నారు. ఎరువుల అక్రమ తరలింపు, బ్లాక్‌మార్కెటింగ్, అవసరానికి మించి నిల్వ చేసుకోవడం వంటి సమస్యలను అరికట్టడంతో పాటు, రైతులకు అవసరమైన మేరకు ఎరువులు అందేలా చేయడమే యాప్ తీసుకురావడానికి ప్రధాన ఉద్దేశమని వివరించారు. పారదర్శకంగా, అవసరమైన మేరకు సబ్సిడీ యూరియా నిజమైన రైతులకు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం రబీ 2025-26లో 'యూరియా బుకింగ్ యాప్'ను ప్రవేశపెట్టిందని మంత్రి తెలిపారు. తెలంగాణలో అమలు చేసిన ఈ విధానం సత్ఫలితాలను ఇవ్వడంతో దీని ఆధారంగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అన్ని సబ్సిడీ ఎరువుల విక్రయాలను డిజిటల్ విధానంలోకి తీసుకురావడానికి 'ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ యాప్'ను ప్రవేశపెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వం 04.06.2026న ప్రవేశపెట్టిన యాప్‌ను తెలంగాణలో సెప్టెంబర్ 2, 2026 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో అమలు చేసిన యూరియా యాప్ స్థానంలో ప్రస్తుతం యాప్ ద్వారా అన్ని సబ్సిడీ ఎరువుల విక్రయాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. కొత్త యాప్‌ను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న సమయంలో అక్కడక్కడా కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తిన విషయం వాస్తవమేనని మంత్రి అన్నారు. అయితే అవి వ్యవస్థలో శాశ్వతమైన లోపాలు కావని, సాంకేతిక కారణాలతో ఏర్పడిన సమస్యలని తెలిపారు. భారత ప్రభుత్వం నియమించిన సాంకేతిక బృందం మరియు మా అధికారులు యాప్ పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తోందన్నారు. రాబోయే పంట కాలాల్లో రైతులకు ఎలాంటి అంతరాయం లేకుండా సేవలు అందించేందుకు వ్యవస్థను మరింత పటిష్టం చేస్తున్నామని తెలిపారు. స్మార్ట్‌ఫోన్లు లేని రైతులు కూడా ఎరువుల బుకింగ్ చేసుకునేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని మంత్రి తెలిపారు. కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా రైతులు ఎరువులు బుక్ చేసుకోవచ్చన్నారు. అదేవిధంగా వ్యవసాయ శాఖ అధికారులు, ఎరువుల డీలర్లు, రిటైల్ ఎరువుల విక్రయ కేంద్రాల వద్ద ఉన్న వాలంటీర్ల సహకారంతో రైతులకు బుకింగ్ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. రైతు గుర్తింపు, వెరిఫికేషన్‌కు లోబడి ఈ సహాయం అందిస్తారని చెప్పారు. యాప్ ద్వారా రైతులు సులభంగా ఎరువులు బుక్ చేసుకునేలా 'మీ-సేవ' బుకింగ్‌లను కూడా అనుసంధానం చేస్తున్నామని మంత్రి తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం లేని రైతులు లేదా స్మార్ట్‌ఫోన్ లేని రైతులు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం అన్ని ప్రత్యామ్నాయ మార్గాలను అందుబాటులోకి తెస్తోందన్నారు. గిడ్డంగుల నుంచి రిటైల్ విక్రయ కేంద్రాలకు ఎరువులను తరలించడానికి పట్టే సమయం, రసీదుల లెక్కింపు, స్టాక్ బదిలీ నమోదులు, వ-రూరూ సింక్రొనైజేషన్, నెట్‌వర్క్ కనెక్టివిటీ వంటి కారణాలతో కొన్ని సందర్భాల్లో డిజిటల్ స్టాక్, భౌతిక స్టాక్ మధ్య తాత్కాలిక వ్యత్యాసాలు కనిపిస్తున్నాయని మంత్రి వివరించారు. ఈ సమస్యలను అధిగమించేందుకు జిల్లాల వారీగా స్టాక్ తనిఖీలు నిర్వహించాలని, డిజిటల్ రికార్డులు మరియు భౌతిక నిల్వలను క్రమం తప్పకుండా సరిపోల్చాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. ఉద్దేశపూర్వకంగా ఎవరైనా అక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. రాబోయే పంట కాలాల్లో రైతుల సంఖ్య పెరిగినా, ఒకేసారి పెద్ద సంఖ్యలో రైతులు యాప్‌ను వినియోగించినా ఎలాంటి సాంకేతిక అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. యాప్ సాంకేతిక బృందం ఎప్పటికప్పుడు లోడ్ టెస్టింగ్ నిర్వహిస్తోందని, అవసరానికి అనుగుణంగా సర్వర్ సామర్థ్యాన్ని ఆటోమేటిక్‌గా పెంచుకునే విధంగా వ్యవస్థను రూపొందిస్తున్నామని తెలిపారు. గరిష్ఠ వినియోగ సమయంలో కూడా రైతులకు సేవలు అందేలా సాంకేతిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. అనంతరం పలువురు సభ్యులు యూరియా రైతులకు అవసరమైన సమయంలో అందుబాటులో ఉండటం లేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. కౌలు రైతులు యాప్ ద్వారా ఎరువులు బుక్ చేసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గ్రామీణ ప్రాంతాల్లో సిగ్నల్ సమస్యలు, సాంకేతిక ఇబ్బందుల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో యాప్‌ను రద్దు చేయాలని వారు కోరారు. దీనిపై స్పందించిన మంత్రి తుమ్మల యాప్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేసే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత, బ్లాక్‌మార్కెటింగ్‌ను అరికట్టడం, నిజమైన రైతులకు సబ్సిడీ ఎరువులు అందించడం కోసం తీసుకొచ్చిన ఈ విధానాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేస్తామని తెలిపారు. యాప్ ద్వారా ఇప్పటికే 50 లక్షలకు పైగా రైతులు ఎరువులు కొనుగోలు చేశారని మంత్రి వెల్లడించారు. ఇంత పెద్ద సంఖ్యలో రైతులు ఈ వ్యవస్థను వినియోగిస్తున్న నేపథ్యంలో, ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను పరిష్కరించి వ్యవస్థను మరింత మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. యూరియా పంపిణీలో పారదర్శకత కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన యాప్‌ను ఆదర్శంగా తీసుకుని కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అన్ని సబ్సిడీ ఎరువులను యాప్ ద్వారా విక్రయించే విధంగా ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ విధానాన్ని తీసుకొచ్చిందని మంత్రి తుమ్మల తెలిపారు. రాష్ట్రంలో మొదట యూరియా పంపిణీ కోసం ప్రారంభించిన విధానాన్ని ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం విస్తరించి అన్ని సబ్సిడీ ఎరువులకు వర్తింపజేస్తోందన్నారు. రాష్ట్ర యాప్ స్థానంలో కేంద్రం రూపొందించిన యాప్‌ను గత వారమే రాష్ట్రవ్యాప్తంగా పూర్తి స్థాయిలో అమలు చేశామని తెలిపారు. గతంలో రైతులకు కేటాయించిన యూరియాను 'ఇండస్ట్రియల్ యూరియా' పేరుతో పరిశ్రమలకు తరలించిన సందర్భాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. అలాగే అవసరానికి మించి కొంతమంది యూరియాను కొనుగోలు చేసి ఇళ్లలో నిల్వ చేసుకునే పరిస్థితులు కూడా ఉండేవని చెప్పారు. ఇలాంటి అక్రమాలు, దుర్వినియోగం, బ్లాక్‌మార్కెటింగ్ జరగకుండా చూడటంతో పాటు, ప్రభుత్వం అందించే సబ్సిడీ నేరుగా నిజమైన రైతుకు చేరాలనే ఉద్దేశంతో యాప్ విధానాన్ని తీసుకొచ్చామని మంత్రి స్పష్టం చేశారు. రైతులు యూరియాపై ఎక్కువగా ఆధారపడటానికి ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వ ఎరువుల ధరల విధానమేనని మంత్రి తుమ్మల వ్యాఖ్యానించారు. యూరియాకు కేంద్ర ప్రభుత్వం అధిక సబ్సిడీ ఇస్తుండగా, ఇతర కాంప్లెక్స్ ఎరువుల ధరలు రూ. 2,000కు మించి ఉండటంతో రైతులు భూమి ఆరోగ్యాన్ని కాపాడే సమతుల్య ఎరువుల కంటే తక్కువ ధరకు లభించే యూరియా వైపు మొగ్గు చూపాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. అధికంగా యూరియా వినియోగించడం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు, దీర్ఘకాలంలో పంటలపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని మంత్రి తెలిపారు.

## ఘనంగా కాళోజీ 112వ జయంతి వేడుకలు




**హైదారాబాద్, సెప్టెంబర్ 09 :** ఖైరతాబాద్‌లోని తెలంగాణ బీసీ కమిషన్ కార్యాలయంలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు 112వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ మరియు సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి తదితరులు కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ అసిస్టంట్ సెక్రటరీ ఎన్. సునీత, రీసెర్చ్ అసోసియేట్ లక్ష్మీనారాయణ మరియు ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ జి. నిరంజన్ మాట్లాడుతూ, కాళోజీ నారాయణరావు గొప్ప కవి మరియు ప్రజా ప్రతినిధి అని, తెలంగాణ మాండలికాన్ని ఎగతాళి చేసిన వారికి తన శక్తివంతమైన, నిర్భయ-ంమైన కవితల ద్వారా తగిన సమాధానం ఇచ్చారని పేర్కొన్నారు. నిజాంకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ఆంధ్ర మహాసభ కార్యకలాపాలతో ఆయన గ్రంథాలయోద్యమంలో చురుకుగా పనిచేశారని, అలాగే శాసనమండలి సభ్యునిగా కూడా సేవలందించారని గుర్తుచేశారు. ఆయన రాసిన "నా గొడవ" పుస్తకం ఎంతో ప్రజాదరణ పొందిందని, "పుట్టుక నీది, చావు నీది, బతుకంతా దేశానిది" అనే ఆయన ప్రసిద్ధ నినాదం నేటికీ ఎంతోమందికి స్ఫూర్తినిస్తోందని ఆయన అన్నారు.



## ఏలూరు జిల్లాలో శాశ్వత ఎన్‌డీపీఎస్ కాంట్రాబాండ్ స్టోరేజ్ రూమ్ ప్రారంభం

**ఏలూరు, సెప్టెంబర్, 9 :** హైకోర్టు ఆదేశాల మేరకు ఏలూరు జిల్లా పరిధిలో ఎన్‌డీపీఎస్ కేసులకు సంబంధించి స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాలు, గంజాయి, ఇతర నిషేధిత పదార్థాలను భద్రపరిచేందుకు నూతనంగా నిర్మించిన శాశ్వత ఎన్‌డీపీఎస్ కాంట్రాబాండ్ స్టోరేజ్ రూమ్‌ను బుధవారం ఎస్పీ ప్రతాప్ శివ కిశోర్ తో కలిసి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ, శాశ్వత ఎన్‌డీపీఎస్ కాంట్రాబాండ్ స్టోరేజ్ రూమ్ ఏర్పాటు ద్వారా జిల్లాలోని ఎన్‌డీపీఎస్ కేసులకు సంబంధించిన స్వాధీనం చేసిన పదార్థాల భద్రత, పర్యవేక్షణ ,నిర్వహణ మరింత క్రమబద్ధంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ శాశ్వత కాంట్రాబాండ్ స్టోరేజ్ రూమ్‌ను జిల్లా పోలీసు కార్యాలయం , ఏలూరు సమీపంలోని ఏఆర్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేశామన్నారు. ఏలూరు జిల్లా పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్లలో నమోదయ్యే ఎన్‌డీపీఎస్ కేసులకు సంబంధించి స్వాధీనం చేసుకున్న గంజాయి వంటి నిషేధిత మాదకద్రవ్యాలు ఇతర కాంట్రాబాండ్‌ను పోలీసు స్టేషన్ వారీగా క్రమబద్ధంగా భద్రపరచడం జరుగుతుందన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన శాశ్వత కాంట్రాబాండ్ స్టోరేజ్ రూమ్‌లో స్వాధీనం చేసిన పదార్థాల భద్రతకు అవసరమైన ప్రవేశ నియంత్రణ, పర్యవేక్షణ, భద్రతా ఏర్పాట్లు మరియు క్రమబద్ధమైన భద్రపరిచే విధానాలను ఏర్పాటు చేయడం జరిగిందని, దీని ద్వారా ఎన్‌డీపీఎస్ కేసుల్లో స్వాధీనం చేసిన మాదకద్రవ్యాలు మరియు ఇతర నిషేధిత పదార్థాల భద్రత, పర్యవేక్షణ, నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు వీలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ శాఖ, పోలీసు శాఖ, ఇంఉఒఇ విభాగం, నషా ముక్త్ భారత్ అభియాన్ బృందం, రోడ్లు మరియు భవనాల శాఖ ఎస్ఈ విజయరత్నం, ఈఈ కిషోర్‌బాబుజీ, ఏలూరు డిఎస్పితో పాటు ఇతర సంబంధిత జిల్లా స్థాయి శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఝార్ఖండ్ ఓటర్ల జాబితాలో ఆఫ్ఘనీయులు

**దిగ్భ్రాంతికర విషయం వెలుగులోకి..**

**జమ్‌షెడ్‌పూర్, సెప్టెంబర్ 09 :** ఝార్ఖండ్‌లో నిర్వహించిన ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో తీవ్ర దిగ్భ్రాంతికర విషయం వెలుగులోకి వచ్చింది. జమ్‌షెడ్‌పూర్ ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ఓటర్ల ముసాయిదా జాబితాలో ఏకంగా ముగ్గురు ఆఫ్ఘనిస్థాన్ పౌరుల పేర్లు నమోదైనట్లు అధికారులు గుర్తించారు. ముసాయిదా ఓటర్ల జాబితా పరిశీలన, పత్రాల ధృవీకరణ సమయంలో అధికారులు ఈ వ్యత్యాసాన్ని కనిపెట్టారు. నోటీసులు జారీ చేసినప్పటికీ, వారు సరైన భారతీయ పౌరసత్వ పత్రాలను సమర్పించలేకపోయారు. అనంతరం నిర్వహించిన తనిఖీల్లో వారి వద్ద ఆఫ్ఘనిస్థాన్ పాస్‌పోర్టులు లభించడంతో వారు విదేశీయులని నిర్ధారణ అయింది. ఝార్ఖండ్ సీఈవో కేజీ రవికుమార్ ఈ అంశాన్ని ధ్రువీకరిస్తూ, విదేశీ పౌరుల పేర్లను ఓటర్ల జాబితా నుండి తక్షణమే తొలగించినట్లు వెల్లడించారు. విదేశీ పౌరులకు భారతీయ ఓటరు కార్డులు లభించేలా వెనుకుండి సహకరించిన వ్యక్తులు, అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

## సమాచార శాఖలో మట్టి గణపతుల పంపిణీ

**హైదారాబాద్, సెప్టెంబర్ 09 :** పర్యావరణ పరిరక్షణ గాను మట్టి వినాయకుడిని పూజించాలని సమాచార పౌర సం బంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి పేర్కొన్నా రు. నేడు సమాచార పౌర సంబంధాల శాఖ ఉద్యోగులకు మట్టి గణపతి ప్రతిమల పంపిణీని కమీషనర్ ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ముకుంద రెడ్డి మాట్లాడుతూ, పండుగలను పర్యావరణ పరిరక్షణలో భాగంగా భాద్యతా యుతంగా జరుపుకోవాలని అన్నారు. జల వనరుల పరిర క్షణ కాలుష్య నివారణకు కేవలం మట్టి గణపతి మాత్రమే పూజించాలని పేర్కొన్నారు. ఈ ఉచిత గణపతి ప్రతిమల కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ డి.ఎస్ జగన్ తో పాటు ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించిన ఏపీ వక్ఫ్ బోర్డు

- తాలీమ్-ఎ-హునర్ కు అంతర్జాతీయ గుర్తింపు
- అధికారికంగా రికార్డ్ హోల్డర్ గా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు
- విద్యా రంగంలో వినూత్న కార్యక్రమానికి అరుదైన గౌరవం
- ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్

**అమరావతి, సెప్టెంబర్ 9 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చరిత్రలో మరో అరుదైన ఘనత నమోదైంది. పేద, ప్రతిభావంతమైన ముస్లిం విద్యార్థులకు నాణ్యమైన ఉచిత రెసిడెన్షియల్ విద్యను అందించేందుకు చేపట్టిన ప్రతిష్టాత్మక తాలీమ్-ఎ-హునర్ కార్యక్రమానికి అంతర్జాతీయ గుర్తింపు లభించింది. ఈ కార్యక్రమాన్ని గుర్తిస్తూ ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డును అధికారికంగా రికార్డ్ హోల్డర్ గా ప్రకటించింది. మోస్ట్ మెరిటోరియస్ స్టూడెంట్స్ గాట్ ఫ్రీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ (మాస్) విభాగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు పేరును సంస్థ తన అధికారిక రికార్డుల్లో నమోదు చేసి, ఇందుకు సంబంధించిన వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లోనూ ప్రచురించింది. ఈ సందర్భంగా ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, వక్ఫ్ బోర్డు విద్యా రంగంలో చేపట్టిన తాలీమ్-ఎ-హునర్ కార్యక్రమానికి అంతర్జాతీయ గుర్తింపు రావడం ఎంతో గర్వకారణం. ఆర్థిక పరిస్థితి కారణంగా ప్రతిభావంతులైన విద్యార్థుల కలలు ఆగిపోకూడదనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాం. ఇప్పుడు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఏపీ వక్ఫ్ బోర్డు అధికారిక రికార్డ్ హోల్డర్‌గా స్థానం సంపాదించడం మా కృషికి లభించిన గొప్ప గుర్తింపు అని తెలిపారు. ఈ విజయం కేవలం వక్ఫ్ బోర్డుదే కాదు. తాలీమ్-ఎ-హునర్ ద్వారా కొత్త భవిష్యత్తును నిర్మించుకుంటున్న ప్రతి విద్యార్థిదీ. ఈ గుర్తింపు మాపై మరింత బాధ్యతను పెంచింది. విద్య, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో మరిన్ని వినూత్న కార్యక్రమాలను చేపట్టి పేద, ప్రతిభావంతమైన విద్యార్థులకు అండగా నిలుస్తాం" అని అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, మంత్రి నారా లోకేశ్, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ ప్రోత్సాహం, సహకారంతో వక్ఫ్ బోర్డు విద్యా సాధికారతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఆయన తెలిపారు. ఈ అంతర్జాతీయ గుర్తింపు సాధనలో కృషి చేసిన వక్ఫ్ బోర్డు సభ్యులు, అధికారులు, సిబ్బంది, పరీక్షల నిర్వహణలో భాగస్వాములైన అధికారులు, విద్యాసంస్థలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, సహకరించిన ప్రతి ఒక్కరికీ చైర్మన్ అబ్దుల్ అజీజ్ అభినందనలు తెలిపారు. ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు అధికారిక 'రికార్డ్ హోల్డర్'గా నమోదు కావడం బోర్డు చరిత్రలో చిరస్థాయిగా నిలిచే మైలురాయిగా అభివర్ణించారు.



## జనసేన పార్టీ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన

**దుబ్బాక సెప్టెంబర్ 9 (జనం వార్త) :** సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ మరియు తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ నేమూరి శంకర్ గౌడ్ ఆదేశాల మేరకు... స్థానిక అంబేద్కర్ విగ్రహం చౌరస్తాలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై శాంతియుత నిరసన కార్యక్రమం చేపట్టింది. జనసేన దుబ్బాక నియోజకవర్గ నాయకులు మారోజు లక్ష్మణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాకు రాముడి పాలన కావాలి కానీ రాక్షస పాలన వద్దని రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వం పని విధానాన్ని ప్రజలు గమనిస్తున్నారని రాబోయే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు బీఆర్ఎస్ పాలనలోనూ, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలోనూ దుబ్బాక ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదని, ప్రజా సమస్యలను గాలికి వదిలేశారని నాయకులు మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రెండు ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని దుయ్యబట్టారు. ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోని పాలకులఅని అన్నారు రాష్ట్ర ప్రభుత్వం పాలన తీరు మారే వరకు జనసేన పార్టీ తరపున ప్రజా పోరాటాలు కొనసాగిస్తామని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో గౌడుగు యాదగిరి విజయ్ అశోక్ ఉపేందర్ ప్రశాంత్ పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవ సంబరాలు

**దుబ్బాక సెప్టెంబర్ 9 (జనం వార్త) :** కాళోజి నారాయణ రావు 112వ జయంతి సందర్భంగా తెలంగాణ ఆదర్శ పాఠశాల లచ్చపేటలో ఈరోజు తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండే ప్రారంభమైన కార్యక్రమాలలో భాగంగా తెలుగు కవులు రచయితల చిత్రపటాల ప్రదర్శన, గ్రంథాలయంలోని 400 తెలుగు పుస్తకాల ప్రదర్శన అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. 12 అంశాలలో విద్యార్థులకు భాషా సంబంధమైన పోటీలు నిర్వహించారు. 42 మంది విద్యార్థులు తెలంగాణ కవులు, రచయితలు, ఉద్యమ వీరులు, ప్రముఖులు, తెలంగాణ కళలు, సంస్కృతి, భాష, ఉద్యమం మొదలైన అంశాలపై చక్కగా ప్రసంగించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి ప్రభుదాస్ . తెలుగు భాష ఔన్నత్యాన్ని విద్యార్థులకు తెలియజేసి, ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం ఇంత గొప్పగా జరగడాన్ని అభినందించారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రిన్సిపల్ బుచ్చిబాబు తెలుగు ఉపాధ్యాయులు నరేష్ భవాని రమేష్ గార్లతో కలిసి గత సంవత్సరం ఇంటర్లో మొదటి సంవత్సరంలో తెలుగులో 99 మార్కులు సాధించిన 16 మంది విద్యార్థులకు అలాగే పదవ తరగతి తెలుగులో వందకు వంద మార్కులు సాధించిన విద్యార్థినికి బహుమతులు ప్రధానం చేశారు. వివిధ కార్యక్రమాలలో పాల్గొని అలరించిన విద్యార్థులకు ప్రిన్సిపల్ మరియు ఉపాధ్యాయులు బహుమతులు అందించారు.




## బహుజన మిత్రుల ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలకు బియ్యం అందజేత!!

**దుబ్బాక సెప్టెంబర్ 9 (జనం వార్త) :** సిద్ధిపేట జిల్లా అక్బర్పేట-భూంపల్లి మండలం భూంపల్లి గ్రామంలో గత కొన్ని రోజుల క్రితం ఆకస్మాత్తుగా గుండె నొప్పితో చనిపోయిన కూర్మ కొత్త ఎల్లయ్య కుటుంబాన్ని,మరియు అనారోగ్యంతో నిన్న మ-రణించిన, దాసరి అన్నబోయిన నర్సింలు కుటుంబాలను, బహుజన మిత్రుల ఆధ్వర్యంలో పరామర్శించడం జరిగింది. అలాగే వారి కుటుంబాలకు వేర్వేరుగా చేయూతకోసం సహాయంగా 50 కిలోల చొప్పున మొత్తం 100 కిలోల బియ్యాన్ని అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బహుజన మిత్రులతో పాటు బాధిత కుటుంబసభ్యులు మరియు గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు.



## వేరుశనగ సాగులో విత్తన శుద్ధిపై అవగాహన

**బిజినపల్లి వట్టెం, సెప్టెంబర్ 9 (జనం వార్త ):** వట్టెం గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ కు చెందిన విద్యార్థుల ఆధ్వర్యంలో వేరుశనగ పంటలో విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన కల్పించే ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విత్తన శుద్ధి యొక్క ప్రాముఖ్యత విత్తన శుద్ధి చేసే సరైన పద్ధతులు మరియు పంట ప్రారంభ దశలో వచ్చే విత్తన సంబంధిత తెగుళ్ళ నివారణ గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ద్వారా వేరుశనగలు మంచి మొలక ఆరోగ్యకరమైన పంట స్థాపన తెగుళ్ల నియంత్రణ మరియు అధిక దిగుబడి సాధించడంలో విత్తన శుద్ధి యొక్క ప్రాముఖ్యతను రైతులు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రీసెర్చ్ అండ్ అనలైజేస్ వింగ్ విద్యార్థులు దివ్య, తేజస్విని, శ్రీలత,గౌతమి, ఐశ్వర్య, వరలక్ష్మీ,మరియు రైతులు పాల్గొన్నారు

## ఆలేరు అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డితో బీర్ల అయిలయ్య చర్చలు

**నియోజకవర్గ సమస్యలు, అభివృద్ధి ప్రతిపాదనలను సీఎం దృష్టికి తీసుకెళ్లిన ప్రభుత్వ విప్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 9 (జనం వార్త) :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ భేటీలో యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన పలు అంశాలతో పాటు ఆలేరు నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై ముఖ్యమంత్రితో చర్చించారు. ఆలేరు నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, ఇంకా పరిష్కారం కావాల్సిన పలు సమస్యలను బీర్ల అయిలయ్య ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ ప్రజల అవసరాలకు అనుగుణంగా చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలపై సీఎంతో వివరంగా చర్చించినట్లు తెలిపారు. అలాగే యాదాద్రి భువనగిరి జిల్లాలో పార్టీ బలోపేతం, కాంగ్రెస్ కార్యకర్తల సమస్యలు, ప్రజలకు మరింత మెరుగైన పాలన అందించే అంశాలపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం. ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం మరింత సహకారం అందించాలని బీర్ల అయిలయ్య ముఖ్యమంత్రిని కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాల్సిన అవసరాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని అంశాలపై సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ప్రజా సంక్షేమం, ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుం



టామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు బీర్ల అయిలయ్య వెల్లడించారు. ఆలేరు అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని బీర్ల అయిలయ్య పేర్కొన్నారు.

## సర్పంచుల సమస్యల పరిష్కారం కోసం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా

**నాగర్‌కర్నూల్ సెప్టెంబర్ 9 (జనం వార్త):** గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న సర్పంచుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నాగర్‌కర్నూల్ జిల్లా సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు వార్ల వెంకటయ్య ఆధ్వర్యంలో జిల్లాలోని పలువురు సర్పంచులు, ప్రజాప్రతినిధులు ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచులు పలు ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. సర్పంచులకు నెలకు కనీస వేతనం రూ.25,000 ఇవ్వాలని, ఉప సర్పంచుల చెక్కు పవర్‌ను రద్దు చేయాలని, గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బకాయి బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో సర్పంచులకు ఓటు హక్కు కల్పించాలని సర్పంచుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గ్రామ ప్రజలచే ప్రత్యక్షంగా ఎన్నికైన సర్పంచులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించడం ద్వారా గ్రామీణ స్థానిక సంస్థలకు మరింత ప్రాధాన్యత, గౌరవం లభిస్తుందని వారు పేర్కొన్నారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, రోడ్లు, వీధి దీపాలు, మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉ



ంటూ సేవలందిస్తున్న సర్పంచులు, నిధుల కొరత మరియు పెండింగ్ బిల్లుల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచులకు తగిన గౌరవం, పారితోషికం కల్పించడంతో పాటు గ్రామ పంచాయతీలకు అవసరమైన నిధులను సకాలంలో విడుదల చేయాలని కోరారు. సర్పంచుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి వెంటనే అమలు చేయాలని వార్ల వెంకటయ్య కోరారు. పెండింగ్ బిల్లుల విడుదలతో పాటు సర్పంచుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే భవిష్యత్తులో మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతామని సర్పంచుల సంఘం నాయకులు హెచ్చరించారు.

## ఘనంగా కాళోజి నారాయణరావు జయంతి

**బిజినపల్లి వట్టెం సెప్టెంబర్9 ( జనం వార్త):** నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం వట్టెం గ్రామంలో ప్రజా కవి పద్మ విభూషణ్ శ్రీ కాళోజి నారాయణరావు గారి జయంతి వేడుకలు ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పూలమాలలు వేసి ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాకవిగా, తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన ఆయన కవిగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా నిజాం వ్యతిరేక ఉద్యమకారుడిగా తన జీవితాన్ని ప్రజల కోసమే అంకితం చేశారు. తెలంగాణ భాషకు, యాసకు ఆయన చేసిన విశేష సేవలను గుర్తింపుగా తెలంగాణ ప్రభుత్వం ఆయన జన్మదినమైన సెప్టెంబర్ 9 ని తెలంగాణ భాష దినోత్సవం గా అధికారికంగా నిర్వహిస్తుందని మాట్లాడారు. నిజాం ప్రభుత్వ ఆకృత్యాలకు వ్యతిరేకంగా హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ చేపట్టిన పోరాటాలలో ముందుండి నడిచారు. తన పోరాటాల కారణంగా పలుమార్లు జైలు శిక్ష అనుభవించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా ఆయన ప్రజా సమస్యలపై పోరాటం ఆపలేదు. 1975లో విధించిన ఎమర్జెన్సీ ని తీవ్రంగా వ్యతిరేకించారు. తొలి దశ తెలంగాణ ఉద్యమంలోనూ తన గళాన్ని వినిపించారు. పండితులకు మాత్రమే పరిమితమైన కవిత్వాన్ని సామాన్యుడు ముంగిటకు తెచ్చిన ఘనత కాళోజీదే అని



కొనియాడారు. తెలంగాణ ప్రజల వాడుక భాషలో కవిత్వం రాసి మెప్పించారు. పద్మ విభూషణ్, గౌరవ డాక్టరేట్ వంటి పురస్కారాలు పొందారన్నారు. ఆయన గౌరవార్థం వరంగల్ లో కాళోజి నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ను తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. డాక్టరేట్ తో సత్కరించింది. సమాజానికి, సాహిత్యానికి చేసిన విశేష సేవలకు గాను భారత ప్రభుత్వం దేశ రెండవ అత్యున్నత పౌర పురస్కారంతో సత్కరించింది. నిరంతరం ప్రజల కోసం పరితపించిన కాళోజి జీవితం నేటి యువ తరానికి ఆదర్శనీయం కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు ప్రధా న ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తా

**అభివృద్ధి పనులకు శంకుస్థాపన : మెదక్ ఎంపీ రఘునందన్ రావు**

**మిరుదొడ్డి, సెప్టెంబరు 9, జనం వార్త :** కాసులాబాద్ గ్రామానికి ప్రధానంగా ఉన్న రహదారి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్‌రావు తెలిపారు. దుబ్బాక నియోజకవర్గం మిరుదొడ్డి మండలం కాసులాబాద్‌లో బుధవారం రజక సంఘం, కుర్మా సంఘం, 20 లక్షల సీసీ రోడ్డు,పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.ఓపెన్ జిమ్ ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. చిట్టాపూర్ నుంచి మోతె, కాసులాబాద్ మీదుగా మిరుదొడ్డికి వెళ్లే ప్రధాన రహదారి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అలాగే కాసులాబాద్--హబ్సిపూర్ రహదారిని కూడా బాగు చేయిస్తామని తెలిపారు. రహదారి పనులకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో బిల్లులు సకాలంలో విడుదల కాకపోవడంతో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ఆసక్తి చూపడం లేదని పేర్కొన్నారు. కాంట్రాక్టర్లతో మాట్లాడి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామంలోని కమ్యూనిటీ హాళ్ల అభివృద్ధికి ఒక్కో హాల్‌కు రూ.5 లక్షల చొప్పున నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. గౌడ




సంఘంతో పాటు వివిధ కుల సంఘాల ప్రతినిధుల నుంచి వినతిపత్రాలు స్వీకరించి, వాటిలో పేర్కొన్న అభివృద్ధి పనులను ప్రాధాన్య క్రమంలో చేపట్టేందుకు కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాబాయ్ కొమురయ్య, ఉపసర్పంచ్ మాడుగురి రాజు, బీజేపీ మండల అధ్యక్షుడు అమర్, మండల ఉపాధ్యక్షుడు, సీనియర్ నాయకుడు బోయిని రాజు, గొరేషం గౌడ్, నరేష్, భాను, లక్ష్మణ్, బొప్పాపూర్ సర్పంచ్ భాను, అందే సర్పంచ్ కడారి యాదగిరి, 8వ వార్డు కౌన్సిలర్ మెరుపుల సాయిగౌడ్, బీజేపీ నాయకులు బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య

**18 వార్డ్ కౌన్సిలర్ శ్రీరాం సరస్వతి నరేందర్**

**దుబ్బాక సెప్టెంబర్ 9 (జనం వార్త) :** ప్రైవేట్ పాఠశాలల కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను నడిపించి కార్పొరేట్ విద్యను విద్యార్థులకు అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు అడుగులు వేస్తుందని అందులో భాగంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కూల్ యూనిఫాంలు అందించడం జరిగిందని 18 వ వార్డు కౌన్సిలర్ శ్రీరాం సరస్వతి నరేందర్ అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆకుల భరత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**వట్టెం, సెప్టెంబర్ 9 (జనం వార్త):** వట్టెం గ్రామంలోని గ్రామ సచివాలయంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ డిప్యూటీ సర్పంచ్ వంగ వినీత్ గౌడ్ పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సర్పంచ్ వంగ వినీత్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాలకు సంక్షేమ పథకాలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా అందించేందుకు స్మార్ట్ రేషన్ కార్డుల విధానాన్ని అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులకు రేషన్ సరుకుల పంపిణీతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సులభంగా అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, గ్రామస్థులు పాల్గొన్నారు. స్మార్ట్ రేషన్ కార్డులు అందుకోవడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.



## ఆశాజ్యోతి ఆశ్రమంలో మల్లారెడ్డి జన్మదిన వేడుకలు

**మేడ్చల్, సెప్టెంబర్ 9:** మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని డాక్టర్ భద్రారెడ్డి ఆదేశాల మేరకు మేడ్చల్ పట్టణంలోని శాంతాబైటిక్ కంపెనీ సమీపంలోని ఆశాజ్యోతి ఆశ్రమంలో ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఆశ్రమంలోని సుమారు 350 మంది విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి మల్లారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి, చిన్నారులతో కలిసి బీఅర్ఎస్ నాయకులు భోజనం చేశారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ నాయకుడు, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ఆకిటి నవీన్ రెడ్డి మాట్లాడుతూ.. మల్లారెడ్డి మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకోవాలని, ఆయురారోగ్యాలతో ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. రానున్న రోజుల్లో కూడా మల్లారెడ్డి రాజకీయంగా మరింత ఉన్నత స్థాయికి ఎదిగి ప్రజలకు సేవ చేయాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సద్ది సుశాంత్ రెడ్డి, మండల రవి, గొంగల్ల శేఖర్ రెడ్డి, కోలాశ్రీ వెంకటేష్, దగ్గు పవన్, రఘు, శ్రీనాథ్, వరుణ్ రెడ్డి, కార్యకర్తలు, ఆశ్రమ నిర్వాహకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## అల్వాల్ చెరువు పరిరక్షణకు విద్యార్థుల శ్రమదానం

**మేడ్చల్, సెప్టెంబర్ 9 జనం వార్త:** చెరువుల పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే లక్ష్యంతో లోయోలా అకాడమీ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు బుధవారం అల్వాల్ చెరువు వద్ద శుభ్రత, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కమ్యూనిటీ ఔట్రీచ్ కార్యక్రమంలో భాగంగా 'సేవ్ అల్వాల్ లేక్' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు చెరువు పరిసరాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్, చెత్తను తొలగించారు. చెరువు పరిసరాల్లో చెత్తను పడేయడం, వ్యర్థాలను డంప్ చేయడం నిషేధించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. భవిష్యత్తులో చెరువు నీటిని ఉపయోగకరమైన అవసరాల కు వినియోగించుకునేలా చెరువు పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ బోగేశ్వర్ రావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సందీప్, పారిశుధ్య విభాగం అధికారులు ప్రభాకర్, స్వామి, కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ డాక్టర్ ఎన్.బి. బాబాబు, కరస్పాండెంట్ ఫాదర్ డాక్టర్ ఎ. రెక్స్ ఏంజెలియో, వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ పీటర్, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ స్టీఫెన్ ఆశీర్వాదం పాల్గొన్నారు.



## నవ్యాంధ్ర పర్యాటకానికి అంతర్జాతీయ స్థాయి ప్రాచుర్యం

- నవ్యాంధ్రలో తొలిసారిగా 41వ 'ఐఏటీఓ' జాతీయ సదస్సు
- ఇండియా - ది వరల్డ్స్ నెక్స్ట్ టూరిజం ఆపర్చునిటీ" థీమ్‌తో సదస్సు నిర్వహణ

**విశాఖపట్నం, సెప్టెంబర్ 9 :** ఆంధ్రప్రదేశ్ లో బాధ్యతాయుతమైన, పర్యావరణహిత పర్యాటకరంగాన్ని అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నాయకత్వంలో, కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలతో రాష్ట్రంలో పర్యాటక విప్లవం ఆవిష్కృతమవుతోందని ఆయన స్పష్టం చేశారు. విశాఖపట్నంలోని నోవాటెల్ హోటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో, ఈ నెల 10 నుండి 12 వరకు విశాఖ వేదికగా జరగనున్న 41వ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ జాతీయ సదస్సు వివరాలను మంత్రి దుర్గేష్ మీడియాకు వెల్లడించారు. సెప్టెంబర్ 13న ఐఏటీఓ సభ్యుల కోసం ఏపీలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో 6 ప్రత్యేక 'పోస్ట్ కన్వెన్షన్' టూర్లు ఏర్పాటు చేశామన్నారు. నవ్యాంధ్రలో తొలిసారిగా ప్రతిష్టాత్మక 'ఐఏటీఓ' జాతీయ సదస్సు..గ్లోబల్ టూరిజం డెస్టినేషన్‌గా ఏపీఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. భారతదేశంలో ఇన్-బౌండ్ టూరిజం అభివృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యంగా ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ ప్రతిష్టాత్మక 41వ జాతీయ సదస్సును ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం వేదికగా ఈ నెల 10 నుండి 12వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తోందని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. "ఇండియా - ది వరల్డ్స్ నెక్స్ట్ టూరిజం ఆపర్చునిటీ" అనే ముఖ్య థీమ్ తో జరుగుతున్న ఈ సదస్సులో దేశవ్యాప్తంగా 1,000 మందికి పైగా పర్యాటక రంగ ప్రతినిధులు, ప్రముఖ టూర్ ఆపరేటర్లు, విధాన నిర్ణేతలు మరియు పారిశ్రామికవేత్తలు పాల్గొంటున్నారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 2,068 కంటే ఎక్కువ మంది ప్రతినిధులతో ఇన్-బౌండ్ టూరిజంలో అగ్రగామిగా ఉన్న ఐఏటీఓ ) జాతీయ సదస్సుకు విశాఖపట్నం ఆతిథ్యం ఇవ్వడం గర్వకారణమని మంత్రి దుర్గేష్ తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఒకసారి జరిగిన ఈ సదస్సు, నవ్యాంధ్రప్రదేశ్ ఆవిర్భావం తర్వాత జరగడం ఇదే తొలిసారి అని తెలిపారు. ఈ వేదిక ఏపీ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడానికి దోహదపడుతుందన్నారు. రేపు (గురువారం) సాయంత్రం జరిగే ఐఏటీఓ జాతీయ సదస్సు ప్రారంభ కార్యక్రమానికి కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. అదే విధంగా కేంద్ర పర్యాటక శాఖ కార్యదర్శి భువనేష్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు మరియు పర్యాటక రంగ ప్రముఖులు హాజరుకానున్నారన్నారు. ఈ సదస్సు ద్వారా ఆంధ్రప్రదేశ్ 1000కి.మీలకు పైబడిన సుదీర్ఘ సముద్ర తీరం, ఆధ్యాత్మిక ప్రాశస్త్యం, అరకు లోయ, గిరిజన సంస్కృతి, బౌద్ధ క్షేత్రాలు మరియు సహజ సౌందర్యాన్ని అంతర్జాతీయ పర్యాటక పటంలో నిలపడానికి వేదిక సుగమమైందన్నారు.

## సీఎం చంద్రబాబు అధ్యక్షతన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సు

**జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర సచివాలయంలో రెండు రోజుల పాటు సమావేశం**

**అమరావతి, సెప్టెంబర్ 09 :** 10, 11వ తేదీల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సు జరగనుంది. రాష్ట్ర సచివాలయంలో రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు జిల్లా కలెక్టర్లతో పాటు మంత్రులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, విభాగాధిపతులు పాల్గొననున్నారు. 7వ కలెక్టర్ల సదస్సులో తీసుకున్న నిర్ణయాలపై చేపట్టిన చర్యల నివేదికతోనే మొదటి రోజు సమావేశాలు ప్రారంభమవుతాయి. ఆర్థిక వృద్ధి, సంక్షేమం, మానవాభివృద్ధి, సాంకేతికత, పెట్టుబడులు, శాంతిభద్రతలు లాంటి కీలక విభాగాల వారీగా సమీక్షించనున్నారు. అలాగే ప్రభుత్వ సేవలు, వివిధ పథకాల అమలు వంటి వాటిపై క్షేత్రస్థాయి పరిస్థితులపై ముఖ్యమంత్రి కలెక్టర్లకు దిశా నిర్దేశం చేయనున్నారు. రెండు రోజులు... 19 అంశాలుమొదటి రోజున జీఎస్డీపీ, స్వర్ణాంధ్ర విజన్‌కు జిల్లాస్థాయి రోడ్‌మ్యాప్‌లపై సమీక్షిస్తారు. అదే విధంగా సూపర్ సిక్స్ పథకాలు, తాగునీరు, గృహనిర్మాణం, ఆరోగ్యం, విద్యా రంగంలో పురోగతి, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, జలధార, జిల్లాల బెస్ట్ ప్రాక్టీసెస్ సదస్సులో పలువురు కలెక్టర్లు ప్రదర్శిస్తారు. ఇక రెండో రోజు సదస్సులో ఇ-గవర్నెన్స్, ఫైళ్ల పరిష్కారం, ఆర్టీజీఎస్, ప్రజా సమస్యల పరిష్కార వేదిక, జిల్లాల వారీ ర్యాంకింగ్స్, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్, కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగం, నైపుణ్యాభివృద్ధి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమం, శాంతిభద్రతలపై సమీక్షించి... అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేయనున్నారు.



## పోషణ్ మహ్ -2026 గోడప్రతులను ఆవిష్కరించిన కలెక్టరు కె.వెట్రిసెల్వి

**ఏలూరు, సెప్టెంబరు 09 :** కలెక్టరేటు గౌతమి సమావేశ మందిరంలో జిల్లా మహిళా అభివృద్ధి. శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పోషణ్ మహ్ -2026 గోడప్రతులను జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ పిల్లలు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికల్లో పోషక ఆహారంపై అవగాహన పెంపొందించడమే పోషణ్ మహ్-2026 ప్రధాన లక్ష్యమని అన్నారు. సమతుల్య ఆహారం, పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్యం, తల్లిపాలు, చిన్నారులు ఆరోగ్యసంరక్షణ వంటి అంశాలుపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలు ద్వారా పోషకాహార కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, పోషకాహార లోపం ఉన్న చిన్నారులను గుర్తించి వారికి అవసరమైన వైద్య, పోషక సహాయం అందించాలని అన్నారు. ప్రతి కుటుంబం పోషకాహారం, ఆరోగ్యం పట్ల బాధ్యతగా వ్యవహరించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పోషణ్ మహ్-2026 సందర్భంగా జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను భాగస్వాములను చెయ్యాలని జిల్లా కలెక్టరు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింటు కలెక్టరు డా.యం.జె.అభిషేక్ గౌడ, ఇంచార్జి డిఆర్వో, ఎస్సీ కార్పొరేషన్ ఇడి యం.ముక్కంటి, విజిలెన్స్ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎల్.దేవకీదేవి, ఐసిడిఎస్ పిడి పి.శారద, జిల్లా పంచాయతీ శాఖ అధికారి జి.వి.కె.మల్లిఖార్జునరావు, నగర పాలక సంస్థ కమిషనరు ఏ.భాను ప్రతాప్, జిల్లా విద్యాశాఖ అధికారి యం.వెంకటలక్ష్మమ్మ, డిఆర్డిఏ పిడి టి.వి.విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# నీరు జీవం.. భూమి జీవితం

- మీ భూమి- మీ హక్కు కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- విద్యుత్ గ్రిడ్ ఆధునీకరణకు శంకుస్థాపన
- ప్రజల జీవితాల్లో వెలుగు వచ్చేలా చేయటమే పాలన
- మూడేళ్ల క్రితం జరిగిన అరెస్టు ఘటనను గుర్తు చేసుకున్న చంద్రబాబు



**పి.గన్నవరం, సెప్టెంబర్ 9 :** కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గం మాచవరంలో మీ భూమి- మీ హక్కు కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ విద్యుత్ గ్రిడ్ ఆధునీకరణకు శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రసంగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నీరు జీవం అయితే భూమి జీవితం అన్నారు. అందుకే ఈ రెండు కార్యక్రమాలకు కూటమి ప్రభుత్వం ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందని చెప్పుకొచ్చారు. ఇంకా ఏమన్నారో ఆయన మాటల్లోనే... రాష్ట్రంపై తీవ్రమైన ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ గోదావరి నది నుంచి వెయ్యి టీఎంసీలకు పైగా నీరు సముద్రంలోకి వెళ్లింది. ఆ నీటిని వినియోగించుకోగలిగితే మనందరికీ ఎంతో ప్రయోజనం కలిగేది. రాష్ట్ర సచివాలయానికి మాత్రమే పరిమితం కాకుండా... ప్రజల జీవితాల్లో వెలుగు వచ్చేలా చేయటమే పాలన. అందుకే ప్రతీ నెలలోనూ వీలైనన్ని సార్లు ప్రజల మధ్యకు వచ్చి వారి బాగోగులు తెలుసుకుంటున్నాను. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన పైనే ప్రధానంగా దృష్టి సారించి పాలన అందిస్తున్నాం. ప్రతీ నెలా మొదటి తేదీనే పేదల సేవలో పేరిట పెన్షన్ అందిస్తూ ప్రజల్ని కలుస్తున్నాను. పీ4తో సామాజిక భాద్యత కింద వారి జీవన ప్రమాణాలు పెంచే ప్రయత్నం చేస్తున్నాం. అభివృద్ధిల చేయాలి, సంపద సృష్టించాలి. జీవన ప్రమాణాలు పెంచి అంతా గౌరవంగా జీవించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈసందర్భంగా వైసీపీ హయాంలో మూడేళ్ల క్రితం జరిగిన అరెస్టు ఘటనను గుర్తు చేసుకున్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు. నాడు జరిగిన ఘటనలను సభలో వివరించిన ముఖ్యమంత్రి జగన్ నైజాన్ని... జగన్ పైమాజీ సీఎం రోశయ్య వ్యాఖ్యలను ప్రస్తావించారు. ఈ అంశాలపై సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. గొడ్డలి పార్టీ పాలకులు మూడేళ్ల క్రితం నన్ను అన్యాయంగా అరెస్టు చేసిన విషయాన్ని మంత్రి అచ్చెన్నాయుడు గుర్తు చేశారు. మూడేళ్ల క్రితం సెప్టెంబరు 9 తేదీన నన్ను అన్యాయంగా అరెస్టు చేశారు. ఏ తప్పు లేకుండా అరెస్ట్ చేయడం బాధ కలిగించింది. 48 ఏళ్లుగా రాజకీయంలో ఉన్నాను. 31 ఏళ్ల క్రితం తొలిసారి సీఎం అయ్యాను. విలువలతో కూడిన రాజకీయం చేయాలని.. పేద ప్రజలకు, తెలుగు జాతికి న్యాయం చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నాను. చాలా మంది నాపై ఆరోపణలు చేశారు. కోర్టులకు వెళ్లారు. నాపై చేసిన ఆరోపణల్ని రుజువు చేయలేక పోయారు... అదే నా నిబద్ధత. రాజకీయంపై కుటుంబం ఆధారపడకూడదనే 36 ఏళ్ల క్రితం ఫ్యామిలీ బిజినెస్ ప్రారంభించాం. అప్పట్లో ఆర్థిక మంత్రిగా, ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినందున కుటుంబ వ్యాపారాన్ని నా సతీమణికి అప్పగించా. నాకు ధన వ్యామోహం లేదు. కేవలం తెలుగు జాతి బాగుండాలనే నేను నిరంతరం ఆలోచన చేస్తా. నంద్యాలలో ఓ సమావేశానికి వెళ్లిన నన్ను అరెస్టు చేస్తామని అర్ధరాత్రి వచ్చారు.

నాపై ఆరోపణలు ఏమిటో చెప్పాలని అడిగితే... అరెస్టు చేసిన తర్వాత చెబుతామని అన్నారు. ఓ మాజీ ముఖ్యమంత్రిని ఉన్న పళంగా అరెస్టు చేసి రాజమహేంద్రవరం జైలుకు తరలించారు. నా జీవితంలో ఎన్నడూ అనుకోని సంఘటన ఓ దుర్మార్గమైన వ్యక్తి ఆలోచనల వల్ల జరిగింది. నేను జైల్లో ఉన్న సమయంలో నాకేం జరుగుతుందోనని తెలుగు జాతి మొత్తం రోడ్లపైకి వచ్చింది. హైదరాబాద్ లో కొందరు అడ్డుపడినా టెకీలు కూడా ముందుకు వచ్చి నిరసనలు తెలిపారు. దేశవిదేశాల్లోని తెలుగు వారంతా కదలి వచ్చారు. పవన్ కళ్యాణ్ నాకు సంఘీభావం తెలిపేందుకు వస్తుంటే ఆయననూ అడ్డుకున్నారు. ఏమాత్రం వెనక్కు తగ్గకుండా పవన్ కళ్యాణ్ నాకు సంఘీభావం తెలిపారు. గత పాలకులు పెట్టిన కేసులను కోర్టులు కొట్టేశాయి ఈడీ లాంటి సంస్థలు కూడా ఇందులో ఏమీ లేదని తేల్చింది. గతంలో అచ్చెన్నాయుడు లాంటి నేతల్ని బలవంతంగా అరెస్టు చేశారు. వేధింపులు చేశారు. పవన్ కళ్యాణ్ విశాఖ వెళ్తే ఆయన్ను అక్కడి నుంచి బలవంతంగా వెనక్కు పంపేశారు. ఇలాంటి ఘటనలు చాలా జరిగాయి. నేను ముఖ్యమంత్రి అయ్యాక ప్రతీకారం తీర్చుకోవాలంటే ఒక్క నిముషం చాలు. కానీ నేను ఆ పని చేయలేదు. చాలా సౌమ్యంగా ఉంటానని, ఏం చేయలేకపోతున్నారని చాలా మంది అనేవారు. కానీ నాకు సహనం ఎక్కువ. నేను చేసే ఏ పని అయినా అది తెలుగు జాతికి న్యాయం జరగాలన్నదే నా లక్ష్యం. మాజీ సీఎం వైఎస్ఆర్ కు ఆయన కొడుకు విషయంలో జాగ్రత్తలు తీసుకోమని ఆనాడే చెప్పాను. గొడ్డలి పార్టీ అధ్యక్షుడ్ని ఆయన తండ్రి వైఎస్ఆర్ చదువుకోడానికి అమెరికా పంపిస్తే తిరుగుటపాలో వచ్చేశాడు... ఈ విషయం స్వయంగా వైఎస్సే చెప్పాడు. కొడుకుతో బాధలు భరించలేక అతన్ని వైఎస్సార్ బెంగళూరులోనే ఉంచారని తల్లి విజయమ్మ మాజీ సీఎం రోశయ్యకు చెప్పుకుని బాధపడ్డారు... రోశయ్యే స్వయంగా ఈ విషయం చెప్పారు. ఓ సీఎంగా ఉన్న వ్యక్తి తన కుమారుడిని బెంగుళూరు లాంటి చోట పెట్టాడు అంటే గొడ్డలి పార్టీ అధ్యక్షుడు ఎలాంటి వాడో అర్థం చేసుకోండి. వైఎస్ రాజశేఖర్ రెడ్డి తన కొడుకును ఎప్పుడూ ఏపీకి రానీయలేదు బాబాయి వివేకాను గొడ్డలి వేటుతో కిరాతకంగా చంపేశారు. తెల్లవారితే సీఎంగా ఉన్న నాపై నింద వేసి తన పత్రికలో రాయించారు. తన చెల్లి సునీతను కూడా ఏమార్చారు. ఆ రోజే దోషులందరినీ అరెస్టు చేసి ఉంటే ఇప్పుడు పరిస్థితి ఇలా ఉండేదా. ఇప్పుడు తల్లిని, చెల్లినీ కూడా ఆస్తి కోసం మోసం చేస్తున్నారు. అలాంటి వ్యక్తులతో రాజకీయం చేయాల్సిన దుస్థితి వచ్చిందని చెప్పుకొచ్చారు.



## ఏపీలో విద్యుత్ వాహనాలకు ప్రోత్సాహం

- ఈవీ పాలసీతో పర్యావరణహిత రవాణా వ్యవస్థకు బలమైన పునాది
- విద్యుత్ వాహనాల కొనుగోలుపై 5 శాతం రాయితీ
- ఐదేళ్లపాటు రోడ్ ట్యాక్స్ మినహాయింపు
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



**తాడేపల్లి, సెప్టెంబర్ 9 :** ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టి, పర్యావరణ పరిరక్షణ పట్ల ఉన్న నిబద్ధతతో రాష్ట్రంలో విద్యుత్ వాహనాల వినియోగాన్ని మరింతగా పెంచేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతోందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. 2024-29 సస్టైయినబుల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ ద్వారా విద్యుత్ వాహనాల తయారీదారులతో పాటు కొనుగోలుదారులకు కూడా ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు. విద్యుత్ ద్విచక్ర వాహనాలు, ఆటోలు, బస్సులు, రవాణా వాహనాలు, ట్రాక్టర్ల కొనుగోలుపై ఎక్స్‌షోరూమ్ ధరలో 5 శాతం వరకు రాయితీ కల్పించామని తెలిపారు. ఈ ప్రోత్సాహకం 2027 మార్చి వరకు వర్తిస్తుందని చెప్పారు. రాష్ట్రంలో రిజిస్టర్ చేసుకునే విద్యుత్ వాహనాలకు ఐదేళ్లపాటు రోడ్ ట్యాక్స్ మినహాయింపు కల్పించడం ద్వారా ప్రజలు ఈవీల వైపు మళ్లేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఛార్జింగ్ మౌలిక వసతులను విస్తరించేందుకు తొలి 5,000 ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఖర్చులో 25 శాతం వరకు, గరిష్ఠంగా రూ.3 లక్షల వరకు ప్రోత్సాహకం అందిస్తున్నామని తెలిపారు.

**దేశవ్యాప్తంగా ఈవీలకు పెరుగుతున్న ఆదరణ**

దేశంలో విద్యుత్ వాహనాల విక్రయాలు వేగంగా పెరుగుతున్నాయని మంత్రి తెలిపారు. ఆగస్టులో దేశవ్యాప్తంగా సుమారు 2.98 లక్షల విద్యుత్ వాహనాలు విక్రయించబడటం, గత ఏడాదితో పోలిస్తే 52.9 శాతం వృద్ధి నమోదవడం ఈ రంగానికి పెరుగుతున్న ఆదరణకు నిదర్శనమ న్నారు. మొత్తం వాహన మార్కెట్‌లో ఈవీల వాటా 9.5 శాతం నుంచి 12.3 శాతానికి పెరగడం భవిష్యత్ రవాణా వ్యవస్థలో విద్యుత్ వాహనాల ప్రాధాన్యతను తెలియజేస్తోందన్నారు. 2029 నాటికి రాష్ట్రంలో 2 లక్షల విద్యుత్ ద్విచక్ర వాహనాలు, కనీసం 10 వేల త్రిచక్ర వాహనాలు, 20 వేల కొత్త విద్యుత్ కార్లను ప్రోత్సహించడంతో పాటు ప్రజా రవాణాలో ఈవీల వినియోగాన్ని విస్తరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రతి 30 కిలోమీటర్లకు ఒక విద్యుత్ ఛార్జింగ్ స్టేషన్ అందుబాటులోకి తీసుకురావడం, ఈ-మొబిలిటీ నగరాల అభివృద్ధి, స్టార్టప్‌లకు ప్రోత్సాహం వంటి చర్యలు రాష్ట్రంలో పర్యావరణహిత రవాణా వ్యవస్థకు దోహదపడతాయని మంత్రి పేర్కొన్నారు. చంద్రబాబు నాయకత్వంతో ఆంధ్రప్రదేశ్‌ను ఎలక్ట్రిక్ మొబిలిటీ రంగంలో దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.

## ప్రతిష్టాత్మకంగా గోదావరి పుష్కరాలు

- రహదారుల అభివృద్ధికి రూ. 300 కోట్ల మంజూరు
- ఆర్థిక శాఖ ఆమోదం
- ఆర్ అండ్ బీ శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి

**అమరావతి,సెప్టెంబర్ 9 :** సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రోడ్ల అభివృద్ధికి రూ. 300 కోట్లకు ఆర్థిక శాఖ ఆమోదం తెలిపినట్లు మంత్రి బి.సీ. జనార్ధనరెడ్డి తెలిపారు. ఈ నిధులత గోదావరి పరిసర ప్రాంతాల్లోని 6 జిల్లాల్లో 78 రోడ్ల మరమ్మతులు, పూర్తిగా దెబ్బతిన్న రోడ్ల పునరుద్ధరణకై ఈ నిధులు కేటాయింపు జరిగినట్లు చెప్పారు. తూర్పు ,పశ్చిమ గోదావరి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, పోలవరం, ఏలూరు జిల్లాల్లో రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. రూ. 300 కోట్ల నిధులుతో దాదాపు 431 కి.మీ మేర స్టేట్ హైవే జిల్లా ప్రధాన రోడ్ల అభివృద్ధి జరుగుతుందన్నారు. స్టేట్ హైవే లకు సంబంధించి 275 కి.మీ మేర 41 రోడ్ల పనులకు రూ.185.75 కోట్ల నిధులు , జిల్లా ప్రధాన రహదారులు సంబంధించి 155 కి.మీ మేర 37 రహదారులకు రూ. 114.25 కోట్ల నిధులు కేటాయింపు జరిపినట్లు మంత్రి చెప్పారు. రూ. 300 కోట్ల నిధులతో గోదావరి తీరంలో 6 జిల్లాల్లో ఆర్ అండ్ బీ రోడ్ల రూపురేఖలు మారతాయని చెప్పారు. గోదావరి పుష్కరాలకు తరలివచ్చే భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యాల కల్పనే లక్ష్యంగా భారీగా ఈ నిధుల కేటాయింపు జరిగినట్లు తెలిపారు.

## గరివిడి వెటర్నరీ కళాశాలపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదు

- వైసీపీ నేతలు ముందు తమ ఐదేళ్ల పాలనపై ఆత్మపరిశీలన చేసుకోవాలి: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి, సెప్టెంబర్ 09 :** గరివిడి వెటర్నరీ కళాశాలకు వీసీఐ అనుమతులు లభించకపోవడంపై వైసీపీ నేతలు మాట్లాడటం చూస్తుంటే... అసలు వారికి ఆ అంశంపై మాట్లాడే నైతిక హక్కు ఎవరు ఇచ్చారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. ఐదేళ్లు అధికారంలో ఉండి కళాశాల అభివృద్ధిని పట్టించుకోని వారు, ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. ఉత్తర కోస్తా ఆంధ్ర ప్రజలకు మెరుగైన పశువైద్య సేవలు అందించడంతో పాటు, ఈ ప్రాంతంలో వెటర్నరీ విద్యను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో 2016లో గరివిడిలో వెటర్నరీ కళాశాలను ఏర్పాటు చేసింది తెలుగుదేశం ప్రభుత్వమే అని అచ్చెన్నాయుడు తెలిపారు. 2017 ఏప్రిల్‌లో రూ.81.72 కోట్లతో పరిపాలనా అనుమతులు మంజూరు చేశామని, 2018 ఫిబ్రవరిలో సుమారు 90 ఎకరాల భూమిని కేటాయించి నిర్మాణ పనులు ప్రారంభించామని వివరించారు. కళాశాల అభివృద్ధికి అవసరమైన ఐదేళ్ల సమయం అధికారంలో ఉన్న వైసీపీ ఏం చేసింది? అని మంత్రి నిలదీశారు. ఐదేళ్లలో ఒక్క బోధనా పోస్టునైనా భర్తీ చేశారా? అవసరమైన ప్రయోగశాల పరికరాలు సమకూర్చారా? వీసీఐ ప్రమాణాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించారా? నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేశారా? కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించారా? ఈ ప్రశ్నలకు వైసీపీ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 2024 ఆగస్టు నాటికి పూర్తికావాల్సిన నిర్మాణ పనులు గత ప్రభుత్వ హయాంలో పూర్తి కాలేదని, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు కూడా ముందుకు సాగలేదని తెలిపారు. పెండింగ్ బిల్లులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిష్కరించిందని స్పష్టం చేశారు. గరివిడి వెటర్నరీ కళాశాలలో మౌలిక వసతుల విషయంలో ఎలాంటి ప్రధాన లోపాలు లేవని తాజా వీసీఐ పరిశీలన స్పష్టం చేసిందని అచ్చెన్నాయుడు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవసరమైన ప్రయోగశాల పరికరాలు సమకూర్చడంతో పాటు అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, క్లినికల్ కాంప్లెక్స్, బాలురు, బాలికల వసతిగృహాల నిర్మాణ పనులను పూర్తి చేసిందన్నారు. వీసీఐ ప్రమాణాలకు అనుగుణంగా దాదాపు 99 శాతం మౌలిక వసతుల పనులు పూర్తయ్యాయని తెలిపారు. కళాశాలలో సిబ్బంది కొరతను పూర్తిగా పరిష్కరించేందుకు ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు కలిపి మొత్తం 253 బోధనా పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతి పొందామని మంత్రి తెలిపారు. ఇప్పటికే వీసీఐ సూచనల మేరకు కాంట్రాక్ట్ అధ్యాపకులను నియమించి మొత్తం బోధనా సిబ్బంది సంఖ్యను 77కు పెంచామని చెప్పారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల రెగ్యులర్ నియామక ప్రక్రియలో ఆలస్యం జరిగిందని, అయితే ఆరు నెలల్లో నియామక ప్రక్రియను పూర్తి చేసి వీసీఐ అనుమతులను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# జెప్టోకు పోటీగా ఫ్లిప్‌కార్ట్ నుంచి మినిట్స్ యాప్




ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ తన క్విక్ కామర్స్ సేవలను మరింత విస్తరించేందుకు సిద్ధమైంది. 'ఫ్లిప్‌కార్ట్ మినిట్స్' పేరిట ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చింది. ఈ యాప్ ద్వారా నిత్యావసర సరుకులను కేవలం నిమిషాల వ్యవధిలోనే డెలివరీ చేయనుంది. ఈ యాప్ ప్రస్తుతం గూగుల్ ప్లే స్టోర్‌లో ఆండ్రాయిడ్ వినియోగదారులకు అందుబాటులోకి వచ్చింది. దీంతో ఇప్పటికే ఈ రంగంలో సేవలందిస్తున్న బ్లింకిట్, జెప్టో, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ కంపెనీలకు గట్టి సవాల్‌గా మారనుంది. పండ్లు, కూరగాయలు, పాలు వంటి నిత్యావసర సరకులు, స్నాక్స్, క్లీనింగ్ ఉత్పత్తులు, గ్యాడ్జెట్లు, స్మార్ట్‌వాచ్‌లను ఈ యాప్‌లో ఆర్డర్ చేయవచ్చని ఫ్లిప్‌కార్ట్ తెలిపింది. వినియోగదారులకు 10నిమిషాల్లో సేవలను అందించడమే కాకుండా, పలు ఉత్పత్తులపై ప్రత్యేక డిస్కౌంట్లు అందిస్తామని పేర్కొంది. ఇంతకుముందు ఫ్లిప్‌కార్ట్ యాప్‌లో ఓ సెక్షన్ కింద ఫ్లిప్‌కార్ట్ మినిట్స్ సేవలను అందించింది. ఇప్పుడు యూజర్లకు మరింత సులువుగా చేరువయ్యేందుకు యాప్‌ను తీసుకొచ్చింది. 130కి పైగా నగరాల్లో వెయ్యికి పైగా డార్క్ స్టోర్లను ఏర్పాటు చేసి కంపెనీ తన సేవలను అందిస్తోంది.



# బిజినెస్




## రానున్న పదేళ్లలో ఏఐతో
# మానవాళికి ముప్పు..

**ఇవాన్ హుబింగర్**

కృత్రిమ మేధ శరవేగంగా అభివృద్ధి చెందుతోన్న తీరు ఆందోళన కలిగిస్తోంది. రానున్న పదేళ్లలో 10 శాతానికి పైగా మనుషులు ఏఐ కారణంగా ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని ప్రముఖ ఏఐ సంస్థ ఆంథ్రోపిక్‌కు చెందిన పరిశోధకుడు ఇవాన్ హుబింగర్ (జుఝుఅ ఎబఎఇఅస్త్రవతీ) హెచ్చరించారు. ప్రస్తుతం ఈ ముప్పు తక్కువగానే ఉందని.. ఒకవేళ ఏఐ తనను తాను మెరుగుపరుచుకునే స్థాయికి చేరితే మాత్రం పరిస్థితి మరింత తీవ్రంగా ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. సాధ్యమైనంత వరకు ఆంథ్రోపిక్ దీనిని ఎదుర్కొనేందుకు కృషి చేస్తుందని చెప్పారు. సూపర్ ఇంటెలిజెన్స్‌తో వచ్చే ప్రమాదాన్ని ఎదుర్కొనేందుకు స్పష్టమైన ప్రణాళికలు లేవని హుబింగర్ తెలిపారు. ఏఐ అభివృద్ధికి తగ్గట్లుగా.. అదే స్థాయిలో భద్రతాపరమైన చర్యలు కొనసాగడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు.. ఓపెన్ ఏఐ ప్రధాన శాస్త్రవేత్త జాకబ్ పచోచ్కి ఏఐ పురోగతిపై ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐ మానవుల నియంత్రణలోనే ఉండాలన్నారు. అందుకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఏఐ వ్యవస్థలు వాటంతటా అవే పనులు చేసే సామర్థ్యం పెరగడమే ఈ ఆందోళనలకు కారణమని నిపుణులు చెబుతున్నారు. తగిన నియంత్రణ లేకపోతే భవిష్యత్తులో ఏఐని అదుపు చేయడం కష్టమేనని హెచ్చరిస్తున్నారు. ఇటీవల అమెరికాలో 1,300 మంది ఏఐ రంగ నిపుణులు.. ఏఐ వ్యవస్థలు సమాజానికి ముప్పుగా మారకుండా అంతర్జాతీయ స్థాయిలో భద్రతా నిబంధనలు తీసుకురావాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. ఈ ప్రయత్నానికి యూఎస్ ప్రభుత్వం మద్దతు ఇవ్వాలని కోరారు. ఆ లేఖపై ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన అగ్రశ్రేణి ఏఐ ల్యాబ్స్, ఐటీ కంపెనీలకు చెందిన పరిశోధకులు, ఇంజినీర్లు, ఉద్యోగులు సంతకం చేశారు.




# 800 పాయింట్లకు పైగా నష్టపోయిన సెన్సెక్స్

**ముంబాయి:** దేశీయ మార్కెట్ సూచీలు బుధవారం భారీ నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చడంతో ముడి చమురు ధరలు భగ్గుమన్నాయి. 100 డాలర్ల మార్కు దాటడం మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం పడింది. ఐటీ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. దీంతో సెన్సెక్స్ 800 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ 203 పాయింట్లు కోల్పోయింది. సెన్సెక్స్ ఉదయం 75,216.22 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 75,577.58) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే ఊగిసలాడిన సూచీ.. చివరికి 813.35 పాయింట్లు పతనమై 74,764.23 వద్ద ముగిసింది. నిఫ్టీ 203.60 పాయింట్లు కోల్పోయి 23,431.50 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.11గా ఉంది. సెన్సెక్స్ 30లో హెచ్‌సీఎల్, ఇన్ఫోసిస్, టెక్‌మహీంద్రా, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు ప్రధానంగా నష్టాలను చవిచూశాయి. అదానీపోర్ట్స్, టాటాస్టీల్, ట్రెంట్, ఎన్‌టీపీసీ, ఏషియన్ పెయింట్స్, పవర్ గ్రిడ్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 100.60 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్స్ ధర 4,391.07 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.




# పీఎఫ్ అడ్వాన్స్ కొత్త రూల్స్..

## ఎన్నిసార్లు విత్‌డ్రా చేసుకోవచ్చంటే..

ఈపీఎఫ్ నుంచి ఉపసంహరణలను ఈపీఎఫ్‌వో మరింత సులభతరం చేసింది. ఇకపై చందాదారుడు తమ వైద్య అవసరాల కోసం నిబంధనలను అనుసరించి ఎన్నిసార్లయినా నగదు విత్‌డ్రా చేసుకునే వెసులుబాటును కల్పించింది. ఈ మేరకు ఈపీఎఫ్ అడ్వాన్స్‌కు సంబంధించి కొత్త నిబంధనలను ఈపీఎఫ్‌వో వెల్లడించింది. ఉద్యోగులు, కార్మికుల వ్యక్తిగత ఈపీఎఫ్ నిధిలో కనీసం 25% నిల్వ ఉంచి మిగిలిన మొత్తాన్ని మాత్రమే ఉపసంహరించుకునేలా ఇప్పటికే సీబీటీ ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఈపీఎఫ్ సభ్యత్వం 12 నెలలు దాటిన తర్వాత చందాదారులు తమ ఈపీఎఫ్ బ్యాలెన్స్ నుంచి 75శాతం వరకు నిధులను విత్‌డ్రా చేసుకునే అవకాశం ఉంది. ఈ పాక్షిక ఉపసంహరణల కోసం గతంలో ఉన్న 13 రకాల సంక్లిష్ట నిబంధనలను విలీనం చేసి.. అత్యవసర (అనారోగ్యం, విద్య, వివాహం), గృహ సంబంధించిన అవసరాలు, ప్రత్యేక పరిస్థితులు అనే మూడు విభాగాలుగా వర్గీకరించింది.

### ఉపసంహరణలు ఇలా..

**కేటగిరీ-1: అత్యవసరాలు**

అనారోగ్యం: పరిమితి లేదు. వ్యక్తిగత, కుటుంబసభ్యుల వైద్య చికిత్సల కోసం చందాదారుడు తన సర్వీసులో ఎన్నిసార్లయినా విత్‌డ్రా చేసుకోవచ్చు. ఈపీఎఫ్‌వో నిబంధనలు వర్తిస్తాయి.

విద్య: వ్యక్తిగత, కుటుంబ సభ్యుల చదువు కోసం మొత్తం సర్వీసులో పదిసార్లు ఉపసంహరించుకోవచ్చు.

వివాహం: వ్యక్తిగత, కుటుంబ సభ్యుల వివాహ ఖర్చుల కోసం ఐదుసార్లు క్లెయిమ్ చేయవచ్చు.

**కేటగిరీ 2: ఇంటికి సంబంధించిన అవసరాలు**

ఇల్లు, భూమి కొనుగోలు, గృహ నిర్మాణం, గృహ రుణ చెల్లింపు, మరమ్మతుల కోసం మొత్తం సర్వీసులో ఐదుసార్లు నగదును అడ్వాన్స్‌గా తీసుకోవచ్చు

**కేటగిరీ 3: ప్రత్యేక పరిస్థితులు**

ప్రకృతి విపత్తులు, లాకౌట్/సంస్థ మూసివేత, ఉద్యోగం కోల్పోవడం, రోగాల వ్యాప్తి వంటి ప్రత్యేక పరిస్థితుల్లో చందాదారులు ఒక ఆర్థిక సంవత్సరంలో రెండుసార్లు నగదును ఉపసంహరించుకోవచ్చు.




## భారత్, ఆఫ్ఘనిస్తాన్ సిరీస్‌కు
# వైభవ్ సూర్యవంశీ

భారత్, ఆఫ్ఘనిస్తాన్ జట్లు సెప్టెంబర్ 13వ తేదీ నుంచి ప్రారంభమయ్యే మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తలపడనున్నాయి. శ్రేయస్ అయ్యర్ భారత జట్టుకు సారథ్యం వహించనుండగా.. తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ తన విధ్వంసకర బ్యాటింగ్‌తో ఈ సిరీస్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాడు. ఈ సిరీస్‌లో అన్ని మ్యాచ్ లు ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా జరగనున్నాయి. టీమిండియాలో పలు కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. సంజూ శాంసన్, జస్ప్రీత్ బుమ్రా తిరిగి జట్టులోకి రాగా.. జింబాబ్వే పర్యటనలో ఉన్న రింకూ సింగ్‌ను ఈ మ్యాచ్‌ల నుంచి తొలగించారు. ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ పూర్తి ఫిట్‌నెస్ సాధించగా.. జస్ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, నితీష్ కుమార్ రెడ్డిల సెలెక్షన్ వారి ఫిట్‌నెస్ ఫలితాలపై ఆధారపడి ఉంటుంది. మరోవైపు ఆఫ్ఘనిస్తాన్ జట్టుకు ఇబ్రహీం జద్రాన్ నాయకత్వం వహిస్తున్నారు. ఇండియాలో ఈ టీ20 సిరీస్ సోనీ స్పోర్ట్స్ నెట్వర్క్ లో ప్రత్యక్షప్రసారం కానుంది. అలాగే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో చూడాలనుకునే అభిమానులు ఫ్యాన్‌కోడ్ యాప్, వెబ్‌సైట్ ద్వారా లైవ్ స్ట్రీమింగ్ ను వీక్షించవచ్చు. ఈ మూడు మ్యాచ్‌లు సాయంత్రం 7:00 గంటలకు ప్రారంభమవుతాయి. భారత క్రికెట్ అభిమానులు ఈ సిరీస్‌లో ఉత్కంఠభరితమైన పోటీలను ఆశించవచ్చు. వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర బ్యాటింగ్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు .

**టీమిండియా జట్టు :** శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, సంజు శాంసన్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), శివమ్ దూబే, నితీష్ కుమార్ రెడ్డిలి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా .

**ఆఫ్ఘనిస్థాన్ జట్టు:** ఇబ్రహీం జద్రాన్ (కెప్టెన్), రహ్మానుల్లా గుర్బాజ్ (వికెట్ కీపర్), నూర్ రెహ్మాన్ (వికెట్ కీపర్), సెడిఖుల్లా అటల్, దర్విష్ రసూలీ, అజ్మతుల్లా ఉమర్‌జాయ్, గుల్బాదిన్ నాయబ్, మహ్మద్ నబీ, రషీద్ ఖాన్, నంగియలై ఖరోటి, నూర్ అహ్మద్, ముజీబుర్ రెహ్మాన్, ఫజల్ హక్ ఫరూకీ, అబ్దుల్లా అహ్మద్‌జాయ్, నవీన్-ఉల్-హక్

**భారత్- ఆఫ్ఘనిస్తాన్ టీ20 సిరీస్ పూర్తి షెడ్యూల్ :** మొదటి టీ20 – సెప్టెంబర్ 13, 2026, అరుణ్ జైట్లీ స్టేడియం (ఢిల్లీ) రెండో టీ20 – సెప్టెంబర్ 15, 2026, అరుణ్ జైట్లీ స్టేడియం (ఢిల్లీ) మూడో టీ20ఐ – సెప్టెంబర్ 17, 2026, అరుణ్ జైట్లీ స్టేడియం (ఢిల్లీ)

## హాట్ కేకుల్లా అమ్ముడవుతున్న
## భారత్-న్యూజిలాండ్ సిరీస్ టికెట్లు




వచ్చే వారం నుంచి టీమ్ ఇండియా వరుస సిరీస్‌లతో బిజిబిజీగా గడపనుంది. సెప్టెంబరు 13 నుంచి అఫ్గానిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్‌లో తలపడనున్న భారత్.. తర్వాత ఆసియా క్రీడలు, వెస్టిండీస్‌తో వన్డే, టీ20 సిరీస్ ఆడనుంది. ఆ వెంటనే న్యూజిలాండ్ పర్యటనకు బయలుదేరుతుంది. ఆతిథ్య జట్టుతో ఐదు టీ20లు, ఐదు వన్డేలు, రెండు టెస్టులు ఆడనుంది. అక్టోబర్ 22న క్రైస్ట్‌చర్చ్‌లో జరిగే తొలి టీ20తో టీమ్‌ఇండియా టూర్ మొదలుకా నుంది. రెండో టీ20 కూడా ఇదే వేదికలో జరగనుంది. 2019 తర్వాత తొలిసారి భారత జట్టు న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లబోతుండటంతో మ్యాచ్‌ల కు ఫుల్ క్రేజ్ ఏర్పడింది. మ్యాచ్‌ల టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడవుతుం డటమే ఇందుకు నిదర్శనం. "సోమవారం సాధారణ ప్రజలకు మ్యాచ్‌ల టికెట్ల అమ్మకాలు ప్రారంభమయ్యాయి. క్రైస్ట్‌చర్చ్‌లో భారత్‌తో జరగనున్న రెండో టీ20తో సహా పలు మ్యాచ్‌ల టికెట్లు పూర్తిగా అమ్ముడయ్యే దిశగా ఉన్నాయి. ఈ మ్యాచ్ టిక్కెట్లు 75 శాతం అమ్ముడయ్యాయి. అక్టోబర్ 30న నాలుగో టీ20 జరగనున్న ఈడెన్ పార్క్ (ఆక్లాండ్)లో అధిక డిమాండ్ ఉంది. దీంతో మొదటిసారిగా స్టేడియం ఆరో అంచె సీటింగ్ తెరవవలసి ఉంది" అని న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

### టీమ్‌ఇండియా.. న్యూజిలాండ్ టూర్ ఇలా..

అక్టోబర్ 22 – తొలి టీ20 (క్రైస్ట్‌చర్చ్)
అక్టోబర్ 24 – రెండో టీ20 (క్రైస్ట్‌చర్చ్)
అక్టోబర్ 27 – మూడో టీ20 (వెల్లింగ్టన్)
అక్టోబర్ 30 – నాలుగో టీ20 (ఆక్లాండ్)
నవంబర్ 1 – ఐదో టీ20 (హామిల్టన్)

# దులీప్ ట్రోఫీ ఫైనల్..

- ఒక్క పరుగుతో తిలక్ వర్మ సెంచరీ మిస్
- ఈస్ట్‌జోన్‌కు భారీ లీడ్



దులీప్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లో సౌత్ జోన్ కేప్టెన్ తిలక్ వర్మ నిరాశకు గురి చేశాడు. చెన్నైలోని చేపాక్ స్టేడియం వేదికగా ఈస్ట్ జోన్‌తో జరుగుతున్న ఈ మ్యాచ్ లో అద్భుత పోరాటపటిమను ప్రదర్శించాడు. ఒంటరి పోరాటంతో జట్టును ఇబ్బందుల నుంచి గట్టెక్కించినప్పటికీ.. ఒక్క పరుగు దూరంలో సెంచరీ చేసే అవకాశాన్ని కోల్పోయాడు. 211 బంతులను ఎదుర్కొన్న తిలక్ వర్మ.. 99 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. అతను అవుట్ అయ్యాక సౌత్ జోన్ తొలి ఇన్నింగ్ ఎంతో సేపు కొనసాగలేదు. 336 పరుగులకు ఆలౌట్ అయింది. నాలుగో రోజు మధ్యాహ్నానికే ఈస్ట్ జోన్ తో 394 పరుగులు వెనుకంజలో ఉంది జట్టు. సౌత్ జోన్ లో ఇద్దరు, ముగ్గరు మినహా మిగిలిన బ్యాటర్లెవరూ పెద్దగా రాణించలేదు. ఓపెనర్ రికి భుయ్ ఒక పరుగుకే అవుట్ అయ్యాడు. నారాయణ్ జగదీశన్- 32, దేవ్ దత్ పడిక్కల్- 62, షేక్ రషీద్- 27, స్మరన్ రవిచంద్రన్- 23, శ్రేయాస్ గోపాల్- 26 పరుగులు చేశారు. చివర్లో చామా వీ మిలింద్ 43 పరుగులతో జట్టును ఆదుకున్నాడు. ఈస్ట్ జోన్ లో ముఖేష్ కుమార్ మూడు వికెట్లతో సత్తా చాటాడు. మహ్మద్ షమీ, ఖురేషీ, శిఖర్ మోహన్ రెండేసి చొప్పున వికెట్లు పడగొట్టారు. తొలి ఇన్నింగ్ లో ఈస్ట్ జోన్ 708 పరుగులకు ఆలౌట్ అయింది. కేప్టెన్ ఇషాన్ కిషన్ 270 పరుగులతో తడాఖా చూపాడు. కుమార్ కుశాగ్ర 101తో చెలరేగాడు. ఈస్ట్ జోన్‌కు ధీటుగా బదులివ్వలేకపోయింది సౌత్. తిలక్ వర్మ, దేవ్ దత్ పడిక్కల్, మిలింద్ మాత్రమే ప్రత్యర్థి బౌలర్లను ముప్పతిప్పలు పెట్టారు. ఈ క్రమంలో తిలక్ వర్మ శతకానికి చేరువ అయ్యాడు గానీ దాన్ని అందుకోలేకపోయాడు. 99 పరుగుల వద్ద ఉన్నప్పుడు మహ్మద్ కొనైన్ ఖురేషీ బౌలింగ్‌లో అతనికే రిటర్న్ క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. ప్రతిష్ఠాత్మక దులీప్ ట్రోఫీ ఫైనల్ లో సెంచరీకి ఒక పరుగు దూరంలో ఇలా దురదృష్టకరంగా అవుట్ కావడం విస్మయానికి గురిచేసింది. దులీప్ ట్రోఫీ ఆరంభం నుండి తిలక్ వర్మ అసాధారణంగా ఆడుతున్నాడు. అత్యుత్తమ ఫామ్‌ను కనబరుస్తోన్నాడు. ఈ సీజన్ సెమీఫైనల్ తొలి ఇన్నింగ్స్‌లో 250 బంతుల్లో అజేయంగా 116 పరుగులు చేయడమే కాకుండా, రెండో ఇన్నింగ్స్‌లో కూడా 79 బంతుల్లో 51 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఇప్పుడు మళ్లీ ఫైనల్ మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో కీలక ప్రదర్శన చేసి, తన జట్టుకు బ్యాటింగ్‌లో సెంచరీకి చేరువ అయ్యాడు.

# టైటిల్ దిశగా దూసుకెళ్తున్న ఈస్ట్ జోన్

దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో ఈస్ట్ జోన్ ఆధిపత్యం మూడో రోజు కూడా కొనసాగింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇషాన్ కిషన్ (270) డబుల్ సెంచరీతో 708 పరుగుల భారీ స్కోరు సాధించిన ఈస్ట్ జోన్, ఆ తర్వాత బౌలింగ్‌లోనూ సౌత్ జోన్‌ను ఇబ్బంది పెడుతోంది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి సౌత్ జోన్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 242 పరుగులు చేసి, ఇంకా 466 పరుగులు వెనుకబడి ఉంది. బ్యాటింగ్‌కు సహకరిస్తున్న పిచ్‌పై మహమ్మద్ షమీ, ముకేష్ కుమార్‌లు తమ బౌలింగ్‌తో సౌత్ జోన్ టాప్ ఆర్డర్‌ను పడగొట్టారు. సౌత్ జోన్ ఓపెనర్ నారాయణ్ జగదీషన్ (32) వేగంగా పరుగులు సాధించే ప్రయత్నం చేసి ముకేష్ కుమార్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ తర్వాత మంచి ఫామ్‌లో ఉన్న దేవదత్ పడిక్కల్ (62) హాఫ్ సెంచరీ బాది నిలకడగా ఆడాడు. షేక్ రషీద్ (27)తో కలిసి ఇన్నింగ్స్‌ను నిలబెట్టే ప్రయత్నం చేస్తుండగా, సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ రివర్స్ స్వింగ్‌తో రషీద్‌ను ఎల్బీడబ్ల్యూగా అవుట్ చేశాడు. ఆ వెంటనే పడిక్కల్‌ను ముకేష్ కుమార్ డీప్ స్క్వేర్ లెగ్‌లో క్యాచ్ ఔట్ చేయడంతో సౌత్ జోన్ కోలుకోలేని దెబ్బతింది. ఈ మ్యాచ్‌లో మరొక ప్రధాన ఆకర్షణ 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ డీఆర్‌ఎస్ నిర్ణయాలు. కెప్టెన్ ఇషాన్ కిషన్ మైదానం వెలుపల ఉన్న సమయంలో స్టాండ్-ఇన్ కెప్టెన్‌గా వ్యవహరించిన సూర్యవంశీ, మైదానంలో చురుగ్గా నిర్ణయాలు తీసుకున్నాడు. అయితే ఆట ముగిసే సమయంలో శ్రేయాస్ గోపాల్‌ను కొనైన్ ఖురైషి ఔట్ చేశాడు. దీంతో మూడో రోజు ఆట ముగిసే సమాయనికి సౌత్ జోన్ 6 వికెట్ల నష్టానికి 242 పరుగులు చేసింది. ఈస్ట్ జోన్ బౌలర్లలో షమీ 2, ముకేష్ కుమార్ 2 వికెట్లు తీయగా.. ఖురేషీ, శిఖర్ మోహన్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

# బెంగళూరుకు హార్దిక్ పాండ్యా!?




భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా కీలక నిర్ణయం తీసుకున్నాడు. ఇకపై బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)ను తన శాశ్వత శిక్షణా కేంద్రంగా మార్చుకుంటూ బెంగళూరుకు తరలివెళ్లాడు. దీంతో బీసీసీఐ అత్యాధునిక శిక్షణా కేంద్రాన్ని శాశ్వత ప్రాక్టీస్ బేస్‌గా ఎంచుకున్న మొదటి భారత క్రికెటర్‌గా హార్దిక్ నిలవనున్నాడు. సాంప్రదాయకంగా భారత కేంద్ర ఒప్పంద ఆటగాళ్లు ప్రధానంగా గాయాల పునరావాసం, ఫిట్‌నెస్ మూల్యాంకనాలు లేదా జాతీయ జట్టు శిబిరాల కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను సందర్శిస్తారు. పాండ్యా నిర్ణయం ఆ పద్ధతికి ఒక ముఖ్యమైన విచలనాన్ని సూచిస్తుంది. ఈ ఆల్‌రౌండర్ అంతర్జాతీయ, ఐపీఎల్ లేదా దేశీయ విధుల్లో లేనప్పుడల్లా అక్కడ శిక్షణ తీసుకోవాలని యోచిస్తున్నాడు. పాండ్యా స్వస్థలం గుజరాత్‌లోని బరోడా అయినప్పటికీ, అతను గత దశాబ్దంలో ఎక్కువ భాగం ముంబైలోనే గడిపాడు. అక్కడ అతను ప్రధానంగా ఘన్సోలిలోని ముంబై ఇండియన్స్ హై-పెర్ఫార్మెన్స్ ఫెసిలిటీలో శిక్షణ పొందాడు. 32 ఏళ్ల అతను ప్రస్తుతం క్వాడ్రిసెప్స్ గాయం నుంచి కోలుకుంటున్నాడు. గాయం కారణంగా అతను యూకేలో జరుగుతున్న భారత వైట్-బాల్ పర్యటనకు దూరమయ్యాడు. 6 నెలలుగా తన పునరావాసం, శిక్షణా కార్యక్రమంలో భాగంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో గణనీయమైన సమయాన్ని గడిపాడు. 'హార్దిక్ ఇప్పటికే శాశ్వతంగా బెంగళూరుకు మారాడు. అతను నగర శివార్లలో, సీఓఈకి సమీపంలో ఒక ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. తన కెరీర్‌లో మిగిలిన కాలానికి సీఓఈని తన శాశ్వత శిక్షణా కేంద్రంగా చేసుకున్న మొదటి భారత క్రికెటర్ అతనే అవుతాడు.' అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. శిక్షణ కోసం తన లోయర్ పరేల్ నివాసం నుంచి ప్రతిరోజూ ప్రయాణించడం రోజురోజుకూ అసౌకర్యంగా మారడంతో పాండ్యా ముంబైని విడిచి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. తన లోయర్ పరేల్ నివాసం నుంచి శిక్షణ కోసం ప్రతిరోజూ ప్రయాణించడం సమస్యగా మారడంతో హార్దిక్ ముంబై నుంచి బయటకు వెళ్లాలనుకున్నాడు. కేంద్ర కాంట్రాక్ట్ క్రికెటర్‌గా, గాయాల నిర్వహణ నుంచి నైపుణ్య శిక్షణ వరకు జూజులోని ప్రతి సదుపాయం అతనికి అందుబాటులో ఉంది. 'అందుకే, అతను ఐపీఎల్, రాష్ట్ర లేదా జాతీయ విధుల్లో లేనప్పుడు సీఓఈని తన శాశ్వత స్థావరంగా మార్చుకోవాలని నిర్ణయం తీసుకున్నాడు.' అని ఆ వర్గాలు తెలిపాయి. సీఓఈ నిర్దేశిత కార్యక్రమాలకు వెలుపల, పాండ్యా తన సొంత ఫిజియోథెరపిస్ట్, వ్యక్తిగత స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ కోచ్‌తో కలిసి పనిచేయనున్నాడు. వీరు అతని శిక్షణా దినచర్యలను పర్యవేక్షిస్తారు. 'అతను దేశం తరఫున వైట్ బాల్ క్రికెట్ ఆడుతున్నంత కాలం తన స్థావరాన్ని బెంగళూరుకు మార్చుకున్నట్లే. అతను కనీసం మరో ఐదు, ఆరేళ్లపాటు ఆడాలని భావిస్తున్నాడు. సీఓఈ నియమించిన నెట్ బౌలర్లకు వ్యతిరేకంగా బ్యాటింగ్ చేయడం వంటి నైపుణ్య శిక్షణ చేసినప్పుడు కూడా, హార్దిక్ వారికి తన సొంత జేబు నుంచే డబ్బు చెల్లిస్తాడు.' అని క్రికెట్ వర్గాలు తెలిపాయి.

